ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

తిరుపతి
జిల్లా వార్తలు
మంగళవారం 22 అక్టోబరు 2024

కలెక్టరేట్‌కు పోటెత్తిన అర్జీదారులు


అర్జీదారుల సమస్యలను వింటున్న కలెక్టర్

భారీ వర్షాలతో గత వారం పీజీ ఆర్ఎస్ రద్ద యింది. దీంతో సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమానికి అర్జీదారులు భారీగా తరలివచ్చారు. సమస్యలపై వినతి పత్రాలిచ్చారు.

8లో

అమ్మ.. నాన్న.. తిరుమలా..!



స్వామితో గొప్ప అనుబంధం నాది అంటున్న దర్శకుడు శ్రీను వైట్ల

8లో

కారులో మంటలు

● ప్రయాణికులు క్షేమం

చంద్రగిరి మండలం తొండవాడ వద్ద ఆదివారం రాత్రి అకస్మాత్తుగా కారులో మంటలు చెలరేగాయి. ప్రయాణికులు అప్రమత్తమై కారు దిగిపోయారు. కారు పూర్తిగా కాలిపోయింది. రాజమహేంద్రవరానికి చెందిన ఐదుగురు భక్తులు వేలూరు సమీపంలో గోల్డెన్ టెంపుల్ దర్శనానికి వెళ్లి కారులో తిరిగి తిరుపతికి వస్తున్నారు. తొండవాడ వద్దకు రాగానే ఇంజన్‌లో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన భక్తులు కారు దిగి పరుగులు తీశారు. ఆ వెంటనే కారులో మంటలు వ్యాపించడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు.


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అప్పటికే కారు దగ్ధమైంది. భక్తులు వెంటనే దిగిపోవడంతో ప్రాణాపాయం తప్పింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


- చంద్రగిరి, ఆంధ్రజ్యోతి


కోట బీసీ బాలుర హాస్టల్‌లో విరిగిన కిటికీ రెక్కలు

సంక్షోభ హాస్టళ్లు!

సంక్షేమ హాస్టళ్లు.. సంక్షోభంగా మారాయి. పైకప్పులన్నీ పెచ్చులూడిపోయి కుంగిపోయి.. ఓ క్షణాన్నైనా కూలిపోయేలా కనిపిస్తున్నాయి. తలుపులు, కిటికీలు విరిగిపోయాయి. బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్ల నిర్వహణ సరిగాలేక దుర్వాసన వస్తున్నాయి. పలు హాస్టళ్లలో విద్యార్థులకు బెడ్‌షీట్లు పంపిణీ చేయకపోవడంతో ఇళ్ల నుంచి తెచ్చుకుని వాడుకుంటున్నారు. ఇన్ని దురవస్థల నేపథ్యంలో మెజారిటీ హాస్టళ్లలో విద్యార్థుల హాజరు శాతం దారుణంగా పడిపోయింది. సోమవారం రాత్రి జిల్లావ్యాప్తంగా ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ సంక్షేమ హాస్టళ్లను సందర్శించిన సందర్భంలో ఈ చేదు వాస్తవాలు వెలుగు చూశాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



వాకాడు బీసీ బాలుర హాస్టల్ గదిలో కిటికీలు ఊడిపోవడంతో థర్మోకోల్ అడ్డుగా పెట్టి టేపు వేశారిలా.. - బాలాయపల్లి మండలం వెంగమాంబపురం బీసీ బాలుర హాస్టల్‌లో విరిగిన కిటికీ తలుపులు


చిట్టమూరు బీసీ బాలుర హాస్టల్‌లో విరిగిన తలుపులు

● పెచ్చులూడుతున్న పైకప్పులు
● ఉరుస్తున్న గదులు
● బీటలు వారుతున్న గోడలు
● విరిగిన తలుపులు.. రెక్కలు లేని కిటికీలు
● ఆంధ్రజ్యోతి పరిశీలనలో వెల్లడైన చేదు వాస్తవాలు

హాజరు శాతం దారుణం

- కేవీబీపురం ఎస్సీ బాలుర హాస్టల్‌లో 70 మంది పిల్లలు వుండాల్సి వుండగా సోమవారం రాత్రి 8 గంటల సమయంలో సందర్శిస్తే సగం మందే వున్నారు.
- బీఎన్ కండ్రిగ ఎస్సీ బాలుర హాస్టల్‌లో 66 మందికి గానూ 20 మంది.. బీసీ బీసీ బాలుర హాస్టల్‌లో 115 మందికి 70 మంది.. ఎస్సీ బాలికల హాస్టల్‌లో 113 మందికి 50 మంది ఉన్నారు.
- డక్కిలి బీసీ బాలుర హాస్టల్‌లో 17 మందికి గానూ 10 మందే వున్నారు.
- కోట బీసీ బాలుర హాస్టల్‌లో 98 మందికి గానూ 48 మందే వున్నారు.
- ఓజిలి బీసీ బాలుర హాస్టల్‌లో 40 మందికి గానూ సోమవారం 25 మంది హాజరైనట్టు రిజిస్టర్‌లో నమోదు చేశారు. కానీ, రాత్రి 8 గంటల సమయంలో సందర్శించినప్పుడు 19 మంది మాత్రమే ఉన్నారు.

ఏర్పేడులో కనీస వసతుల్లేవ్

ఏర్పేడు బీసీ బాలుర హాస్టల్లో పిల్లలకు కనీస సదుపాయాలు లేవు. బెడ్‌షీట్లు సరఫరా కాకపోవడంతో ఇళ్ల నుంచి తెచ్చుకుని వాడుకుంటున్నారు. దుస్తులు కూడా ఇంతవరకూ పంపిణీ కాలేదు. వర్షానికి రెండు గదులు ఉరుస్తున్నాయి. గదుల పైకప్పు కాంక్రీటు పెచ్చులూడిపోయి ఇనుప కమ్మీలు కనిపిస్తున్నాయి. పైపులైను పాడవడంతో రెండు వాటర్ ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయి. సిమెంట్ తొట్టిలో నీరు నింపి వాటిని వాడుకుంటున్నారు. ప్రహరీ లేకపోవడంతో ముళ్ల కంచె ఏర్పాటు చేశారు. దీంతో పగలు పశువులు, రాత్రిళ్లు పాములు ఆవరణలోకి వస్తున్నాయి. వార్డెన్ పోస్టు ఖాళీగా ఉండటంతో రేణిగుంట వార్డెన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.


ఏర్పేడు బీసీ బాలుర హాస్టల్‌లో నిరుపయోగంగా నీళ్ల ట్యాంకులు

బీఎన్ కండ్రిగ హాస్టళ్లు భిన్నమేమీ కాదు



బీఎన్ కండ్రిగ ఎస్సీ బాలుర హాస్టల్ భవనం కట్టి 30 ఏళ్లవుతోంది. గోడలు కూడా బీటలు వారాయి. కిటికీల తలుపులు పగిలిపోయాయి. బీసీ బాలుర హాస్టల్‌లో మరుగుదొడ్ల నిర్మాణం ఆరేళ్లుగా అసంపూర్తిగానే వుంది.

దురవస్థలో సత్యవేడు హాస్టళ్లు



సత్యవేడు బీసీ బాలుర హాస్టల్ గదుల పైకప్పు దెబ్బతింది. కాంక్రీటు పెచ్చులూడిపోయి కూలిపోయే స్థితిలో ఉన్నాయి. గదులన్నీ వర్షానికి ఉరుస్తున్నాయి. గోడలు నానిపోయి చెమ్మ తేలి ఉన్నాయి. కిటికీల తలుపులు పుచ్చిపోయాయి. సత్యవేడులోనే ఎస్సీ బాలుర హాస్టల్ పైకప్పు కూలిపోయే ప్రమాదం కనిపిస్తోంది. వంట గది చూస్తే అన్నం తినబుద్ధి కాదు. వాచ్‌మెన్ పోస్టు ఖాళీ. వంట మనిషే అన్ని పనులూ చేస్తున్నారు.

అసంపూర్తి భవనంలో నాయుడుపేట కాలేజీ హాస్టల్

నాయుడుపేట బీసీ సంక్షేమ కళాశాల వసతి గృహం అద్దె భవనంలో నడుస్తోంది. భవన నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. ఫ్లోరింగ్ పూర్తి కాలేదు. గోడలకు ప్లాస్టరింగ్ జరగలేదు. కిటికీలు, తలుపులు కూడా ఏర్పాటు కాలేదు. ఆ గదుల్లోనే విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నారు.



డక్కిలిలో అధ్వానంగా బీసీ హాస్టల్

డక్కిలి బీసీ బాలుర హాస్టల్‌లో గదులన్నీ అధ్వానంగా వున్నాయి. కిటికీలకు తలుపులు పూర్తిగా ఊడిపోవడంతో గోతాములు కట్టి మూసేశారు. వర్షానికి గదులు ఉరుస్తున్నాయని విద్యార్థులు చెప్పారు. బాత్‌రూమ్ దుర్వాసన వెదజల్లుతోంది.



కూలిపోయే స్థితిలో పిచ్చాటూరు హాస్టల్

పిచ్చాటూరు ఎస్సీ బాలుర హాస్టల్ భవనం ప్రమాదకర స్థితిలో ఉంది. పైకప్పు మొత్తం దెబ్బతిని ఏ క్షణాన్నైనా కూలిపోయేలా వుంది. ప్రహరీ లేకపోవడంతో హాస్టల్ చుట్టూ వర్షానికి నీరు చేరుతోంది.

పోలీసులకు రుణపడి ఉండాలి

● అమరవీరుల సంస్మరణ సభలో కలెక్టర్ వెంకటేశ్వర్


అమరవీరుల స్థూపం వద్ద కలెక్టర్, ఎస్పీల నివాళి

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎండనక, వాననక సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశలు పనిచేసే పోలీసులకు యావత్ జాతి అంతా రుణపడి ఉండాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆకాంక్షించారు. తిరుపతి పోలీసు పరేడ్ మైదానంలో సోమవారం జరిగిన అమరవీరుల సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. అమరవీరుల దినోత్సవంలో మనం భాగస్వాములు కావడం, వారి సేవలను స్మరించుకోవడం, వారికి సంతాపం తెలపడం మన విధిగా భావించాలన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమమే లక్ష్యంగా కార్యాచరణ దిశగా ముందుకు వెళుతున్నామని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. పోలీసు అమరవీరుల స్మృతి దినంకు హజరయ్యే అవకాశాన్ని తాను గౌరవంగా భావిస్తున్నట్లు చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా మన జిల్లాలో విధి నిర్వహణలో అసువులు బాసిన ఎనిమిది మందిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా స్థూపం వద్ద అమర వీరులకు నివాళులర్పించారు. కాగా, విధి నిర్వహణలో అసువులు బాసిన ఎస్ఐ రెడ్డినాయక్, ఏఎస్ఐ యువరాజులు నాయుడు, హెడ్‌కానిస్టేబుళ్లు చలపతి రాజు, ఇలియాజ్, శ్రీధర్ బాబు, నాగరాజు, కానిస్టేబుళ్లు విద్యాసాగర్, అనిల్‌కుమార్ కుటుంబ సభ్యులను కలెక్టర్, ఎస్పీ పరామర్శించి ఘనంగా సన్మానించారు. అనంతరం జ్ఞాపికలు అందజేశారు. వారి కుటుంబాలకు తమ శాఖ అండగా ఉంటుందని ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచ్చారి, శ్రీనివాసులు, శ్రీనివాసరావు, డీఎస్పీ వెంకటనారాయణ, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు సిబ్బంది, రిజర్వు పోలీసులు పాల్గొన్నారు.

స్పృహ తప్పిన కానిస్టేబుల్



పరేడ్ నిర్వహణలో ఉన్న రిజర్వు కానిస్టేబుల్ ఉదయకుమార్ గుండె పోటుకు గురై స్పృహ తప్పి పడిపోయారు. వెంటనే కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, అదనపు ఎస్పీలు అక్కడకు చేరుకుని అతన్ని పరామర్శించారు. ప్రాథమిక వైద్యం అందించాక రుయాకు తరలించారు. ప్రస్తుతం ఆరోగ్యం బాగానే వున్నట్లు పోలీసు అధికారులు చెప్పారు.

త్వరలో మరో భవనంలోకి హాస్టల్ మార్పు

● ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


భవనాన్ని పరిశీలిస్తున్న శ్యాంసుందరరావు

భాకరాపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు ఎస్సీ హాస్టల్ భవనాన్ని సహాయ సాంఘిక సంక్షేమ అధికారి శ్యాంసుందరరావు పరిశీలించారు. 'వానొస్తే తడవక తప్పదు' అనే శీర్షికన ఈ నెల 19న ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడటంతో అధికారులు స్పందించారు. సోమవారం ఆ భవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ భవనంలో విద్యార్థులు ఉండడం చాలా ప్రమాదకరమన్నారు. జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి విషయం తీసుకువెళ్లి హాస్టల్‌ను వేరే భవనంలోకి మార్చుతామన్నారు. అయన వెంట వార్డెన్ వేంకటేశ్వరరావు, సిబ్బంది ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు ఉచిత భోజన పథకం ప్రారంభం


రోగులకు భోజనం అందిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం రోగులకు ఉచిత భోజన పథకాన్ని ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు ఆకలితో ఇబ్బంది పడకూడదని భోజన పథకాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఇచ్చిన హామీ ప్రకారం 30 పడకల ఆసుపత్రిని 50 పడకలకు విస్తరించారన్నారు. నైపుణ్య వైద్య సిబ్బందిని నియమించారన్నారు. ఈ ఆసుపత్రిలో రోగులకు ఉచితంగా ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ, క్యాంటీన్ నిర్వాహకులు కఠారి శివయ్య, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు చంద్రగిరి టవర్ క్లాక్ సమీపంలో ఉన్న పాత ఎంపీడీవో కార్యాలయం స్థలంలో భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు

రామచంద్రాపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఈ నెల 24, 25వ తేదీలలో శవ్వాయి కాల్వ, బ్రాహ్మణకాల్వ గ్రామాల్లో నిర్వహించే రీసర్వే గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు వెంకటరమణ కోరారు. రెవెన్యూ కార్యాలయ భవనంలో సోమవారం సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ గ్రామసభల్లో డీటీలు అమృత,అన్వర్‌బాషాతో పాటు సర్వేయర్లు రమేష్‌బాబు, మణి వీర్వో అందుబాటులో ఉంటారన్నారు. ప్రజలు అభ్యంతరాలను గ్రామసభలో రాతపూర్వకంగా తెలియజేసి సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

11 ఎర్రచందనం దుంగల స్వాధీనం


స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

మంగళం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా సీకేదిన్నె మండలం వద్ద టాస్క్‌ఫోర్సు పోలీసులు ముగ్గురిని అరెస్టు చేసి, 11 ఎర్రచందనం దుంగలు, ఒక కారు స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎస్ఐ సురేష్‌బాబు బృందం ఆదివారం రాత్రి సీకేదిన్నె వద్ద కూంబింగ్ చేపట్టింది. మద్దిమడుగు అటవీ ప్రాంతంలో కారులో కొందరు ఎర్రచందనం దుంగలు లోడ్ చేస్తుండగా చుట్టుముట్టారు. ముగ్గురిని పట్టుకోగా మిగిలినవారు పారిపోయారు. నిందితులు తమిళనాడు సేలం జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. 11 ఎర్రచందనం దుంగలు, కారును స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శ్రీనివాస క్రీడా సముదాయంలో సోమవారం జిల్లాస్థాయి అండర్ 14, 17 విభాగాల బాలబాలికల చదరంగం పోటీలు నిర్వహించారు. అండర్ 14 బాలికల విభాగంలో వి.త్రిపురాంబిక, సిరిగిరిసాత్విక తొలి రెండు స్థానాలు కైవసం చేసుకున్నారు. బాలుర విభాగంలో సాత్విక్‌కృష్ణ ద్వితీయస్థానంలో నిలిచాడు. అండర్ 17 బాలుర విభాగంలో రెడ్డిదేదీప్, సిరిగిరి పార్థసాయి, గౌరవ్‌వెంకట్‌లు తొలి మూడు స్థానాల్లో సత్తాచాటారు. వీరు ఈనెల 29, 30 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు.

సమగ్ర పోషక యాజమాన్యంపై శిక్షణ



తిరుపతిరూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ(పీఏసీ) సభ్యులకు సమగ్ర పోషక యాజమాన్యంపై 15 రోజుల శిక్షణను సోమవారం ప్రారంభించారు. చిత్తూరు ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ సంధ్యారాణితో ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ సుమతి కలసి ప్రారంభించి మాట్లాడారు. ఎరువుల ప్రాముఖ్యత, వాడకం, సేంద్రియ, జీవన ఎరువులను ఏ పంటకి ఎంత మోతాదులో వినియోగించాలన్న అంశాలను వివరించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వాడాలని సూచించారు. డాక్టర్ కేవీ నాగమాధురి, డాక్టర్ భార్గవ్, విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కదిరిమోహన్ తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణ ప్రజాప్రతినిధులపై చిన్నచూపెందుకు?'


ఆలయం ముందు అనిరుధ్‌రెడ్డి, వెంకట్

తిరుమల, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తిరుమలలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఏపీ సీఎంతో పాటు టీటీడీ ఈవోపై ఫైర్ అయ్యారు. ఎమ్మెల్సీ బాల్మూరి వెంకట్‌తో కలిసి సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. 'గత డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను తీసుకోమని ఈవో చెప్పారు. విభజన సమయంలో ఏపీ, తెలంగాణ రెండు కళ్లు అని చంద్రబాబు చెప్పారు. మరి ఒక కన్నును తీసేశారా, పొడుచుకున్నారా' అంటూ ప్రశ్నించారు. తెలంగాణాలోని యాదిగిరి, భద్రాచల ఆలయాల్లో ఏపీ ప్రజాప్రతినిధులు ఈవోలకు ఫోన్ చేస్తే దర్శనాలు జరుగుతున్నాయన్నారు. తిరుమలలో మాత్రం తమ నాయకులపై చిన్నచూపు చూస్తున్నారన్నారు. మా దగ్గర వ్యాపారాలు చేసినప్పటికీ ఏనాడు ఒక్క మాట మాట్లాడలేదన్నారు.. మా ఎమ్మెల్యేలందరం కలిసి తీర్మానించుకుని ఇక్కడికి రావద్దంటే ఎలా అనిపిస్తుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా పార్టీలకు అతీతంగా తెలంగాణ నాయకుల సిఫార్సు లేఖలు తీసుకోవాలన్నారు. లేకుంటే డిసెంబరులో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యేలందరం కలిసి నిర్ణయం తీసుకుంటే బాధపడతారన్నారు.

శ్రీవారి సేవలో తెలంగాణ న్యాయమూర్తి


జస్టిస్ నగేష్ భీమపాక- జస్టిస్ వేలుమణి

తిరుమల, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అలాగే మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేలుమణి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శ్రీవారిని దర్శించుకున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.87 కోట్లు

తిరుమల, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.87 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం వివరాలను టీటీడీ సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 73,926 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 23,726 మంది తలనీలాలు సమర్పించారు.

ఆర్సీపురంలో భారీవాన

రామచంద్రాపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం దంచికొట్టింది. ఏకధాటిగా గంటపాటు కురిసిన వర్షానికి ఎక్కడి ప్రయాణికులు అక్కడ నిలబడిపోయారు. పొలాల్లో నీరు నిలవగా, చిన్నపాటి కాలవలు ప్రహించాయి.

ఈ-క్రాప్‌లో సాగు వివరాలు సరిచూసుకోవాలి

ఎర్రావారిపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) ఆన్‌లైన్ ద్వారా ఈ-క్రాప్‌లో నమోదు చేసిన సాగు వివరాలను రైతులు సరి చూసుకోవాలని వ్యవసాయాధికారి ఖాద ర్ భాషా కోరారు. మండలంలో 3356 మంది రైతులకు సంబంధించి 10101.80 ఎకరాల్లో సాగు చేసిప పంటల వివరాలను నమోదు చేశామన్నారు. రైతు తమ గ్రామ పరిధిలోని రైతు భరోసా కేంద్రంలోని జాబితాలో వివరాలను సరిచూసుకోవాలని ఆయన సూచించారు.

చెస్ విజేతలకు అభినందన


మధు ,నేహలతో పరిమళ

ఎర్రావారిపాలెం,అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) క్రీడలతో ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు ఉన్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ పరిమళ అన్నారు. ఇటీవల చెస్ పోటీల్లో తమ పాఠశాల నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఇంటర్ విద్యారినులు మధు, నేహలను సోమవారం ఆమె అభినందిచారు. జాతీయ స్థాయికి ఎదగాలని ఆమె ఆకాంక్షించారు

తిరుమల ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్‌గా గంగరాజు



తిరుమల, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): తిరుమల ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్‌గా డీడీ గంగరాజు నియమితులయ్యారు. ప్రస్తుతం ఆ స్థానంలో ఉన్న సత్యంనాయుడు బదిలీ కావడంతో డీఎస్పీ ప్రమోషన్‌తో గంగరాజును అసిస్టెంట్ కమాండెంట్‌గా ఎంపిక చేస్తూ డీజీపీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గంగరాజు గతంలో టీటీడీ విజిలెన్స్ విభాగంలో అలిపిరి, వైకుంఠం క్యూకాంప్లెక్స్, శ్రీవారి ఆలయ ఏవీఎస్వోగా పనిచేశారు.

స్విమ్స్ పద్మావతి ఆస్పత్రిలో హెర్నియా వారోత్సవాలు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్ పద్మావతి ఆస్పత్రిలో సోమవారం నుంచి శనివారం వరకు వారం రోజుల పాటు హెర్నియా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఆర్వీకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో వివిధ రకాల హెర్నియా నిర్ధారణ పరీక్షలు, సర్జరీలు చేస్తామని పేర్కొన్నారు. హెర్నియాకి సంబంధించిన కారణాలు, దాని నివారణ చికిత్సలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఆరోగ్యశ్రీ, ఆధార్ కార్డు కలిగిన వారికి ఈ సేవలు పూర్తి ఉచితంగా అందిస్తామని వివరించారు. రోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శ్రీపద్మావతి భవనంలోని 49వ గదిలో వైద్యులను సంప్రందించాలని కోరారు. పూర్తి వివరాలకు 7382067087కు సంప్రదించాలని తెలిపారు.

నీటి శుద్ధి కేంద్రాలకు 'మంగళం'!


వైసీపీ ప్రభుత్వంలో - గత టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన నీటిశుద్ధి కేంద్రాలు

తిరుపతి అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మంగళం ఉమ్మడి పంచాయతీ పరిధిలోని సప్తగిరికాలనీలో నీటిశుద్ధి కేంద్రాలు మూతబడ్డాయి. మంచి నీటికోసం ప్రైవేటు దుకాణాలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. సప్తగిరికాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నీటిశుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. స్థానికులు రూ.2 చెల్లించి బిందె నీరు తీసుకెళ్లేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత దాని గురించి పట్టించుకోకపోవడం, శుద్ధికాని నీరు వస్తుండడంతో ప్రజలు రావడం మానేశారు. దీంతో ఆదరణ లేదని మూసివేశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తుడా నిధులతో సచివాలయం ముందు రూ.8 లక్షలతో మరో కేంద్రాన్ని నిర్మించారు. పనులు తుది దశకు చేరుకున్న సమయంలో ఎన్నికల కోడ్ వెలువడడంతో బ్రేక్ పడింది. ఎన్నికలు ముగిసి, కూటమి ప్రభుత్వం ఏర్పడినా ఆ రెండు కేంద్రాలకు విముక్తి లభించలేదు. నిర్వహణ లేమితో యంత్రాలు పూర్తిగా పాడయ్యే దశకు చేరుకున్నాయి. మరోవైపు ప్రజలు మంచినీటి కోసం ప్రైవేటు దుకాణాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ కేంద్రాల్లో ప్రస్తుతం బిందెనీరు రూ.3కు లభిస్తుండగా ప్రైవేటు దుకాణాల్లో రూ.15 నుంచి 20 వరకు వెచ్చించాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. మిగిలిన ప్రాంతాల్లో బాగా నడుస్తున్నాయని, ఇక్కడ మాత్రమే ఈ పరిస్థితి తీసుకురావడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే పులివర్తి నాని మంగళవారం తిరుమలనగర్‌లో పల్లెపండుగ లో భాగంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఆర్వో ప్లాంట్లు తెరిపించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తాగునీరు కొనలేక ఇబ్బందులు

మా ఇంటికి రోజుకు రెండు బిందెల తాగునీరు అవసరం. మరో దారిలేక కొంటున్నాం. ప్రభుత్వ కేంద్రాలు సిద్ధంగా ఉన్నా మూసివేసి నిరుపయోగంగా ఉంచడం సరికాదు. మావి కూలిబతుకులు, రోజూ చేతిలో డబ్బులు ఉండవు. నీరు కొనుక్కోడానికి ఇబ్బంది పడుతున్నాం. తక్షణమే ఆ రెండు కేంద్రాలు ప్రారంభించాలి.

\- వడ్ల తేజస్విని(బీటీఆర్ కాలనీ)

తక్షణమే తెరవాలి

నీటి శుద్ధి కేంద్రాలు తెరవకుండా స్థానిక నాయకులు ఏదో సాకు చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నారు. ఇది మంచి పద్ధతికాదు. ప్రజల ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని వ్యవహరించాలి. కూటమి హయాంలో కూడా తెరవకుండా ఉండడం బాధ కలుగుతోంది. వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టాలి.

\- సుంకరచిన్నరెడ్డిబాబు(సప్తగిరికాలనీ)

చావనైనా చస్తాను గానీ...చెడ్డ పేరు రానివ్వను..

పార్టీ సభ్యత్వ నమోదులో ఎమ్మెల్యే పులివర్తి నాని


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని, హాజరైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

చంద్రగిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే కొండంత బలమని ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ప్రయివేటు కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయిలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. దీనికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ సభ్యత్వం తీసుకున్న వారి సంక్షేమం కోసం పార్టీ అహర్నిశలూ పనిచేస్తుందన్నారు. ప్రమాదవశాత్తూ కార్యకర్త మృతి చెందితే మట్టి ఖర్చులకు రూ.10వేలు ఇస్తుందన్నారు. సభ్యత్వమున్న వారికి రూ.5 లక్షల వరకూ ఆర్థిక చేయూతను ఇవ్వాలని పార్టీ నిర్ణయించిందన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలవడం వెనుక కార్యకర్తల కృషి ఎంతో ఉన్నదన్నారు. తన కుటుంబం ఎక్కడా అవినీతికి పాల్పడదన్నారు. అలా చేసివుంటే చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద చొక్కా పట్టుకుని నిలదీయండని గతంలో యువగళం సభలో చెప్పానని ఆయన గుర్తు చేశారు. ఇప్పటికీ ఆదే మాటకు కట్టుబడి ఉన్నానన్నారు. మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రెడ్డి, ఆయన పేటీఎం బ్యాచ్ తమ కుటుంబంపై చేస్తున్న అవినీతి ఆరోపణలను నిరూపించగలరా అని నాని సవాల్ విసిరారు. పసలేని ఆరోపణలు చేయటం, బురద చల్లడం లాంటివి మానుకోవాలని చెవిరెడ్డికి హితవు పలికారు. తాను గాని, కుటుంబ సభ్యులు గాని ఏ అధికారి వద్ద లంచం తీసుకోలేదని స్పష్టం చేశారు. చావనైనా చస్తాను గాని లంచం తీసుకునే ప్రసక్తే లేదంటూ కార్యకర్తల ముందు ప్రమాణం చేస్తున్నానన్నారు. నియోజకవర్గానికి, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లకు తలవంపులు తెచ్చే పనికి ఏనాడూ పాల్పడనన్నారు. సోషల్ మీడియాలో వచ్చే నిరాధార ప్రచారాలను నమ్మవద్దన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చంద్రగిరి మొదటి స్థానంలో నిలబడేలా చూడాలన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

24 నుంచి పద్మావతి వర్సిటీలో అంతర్జాతీయ సదస్సు

● పలు దేశాల ప్రతినిధుల రాక


మాట్లాడుతున్న వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ వ్యాపార రంగంలో మహిళలు రాణించేందుకు వీలుగా అవసరమైన శిక్షణ అందించేందుకు ఈనెల 24వ తేదీ నుంచి తిరుపతిలో అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. 26వ తేదీ వరకు పద్మావతి మహిళా యూనివర్సిటీలో నిర్వహించే ఈ సదస్సుకు పలు దేశాలకు చెందిన 70 మంది నిపుణులు హాజరు కానున్నారు. పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ ఈ విషయాన్ని మీడియాకు వెల్లడించారు. వ్యాపార, పారిశ్రామిక రంగంలో మహిళలు మరింత రాణించేందుకు అవసరమైన సామర్థ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ సదస్సు చేపట్టినట్లు తెలిపారు. డిజిటల్ మార్కెటింగ్, ఈ-కామర్స్, బిజినెస్ అనలిటిక్స్ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఉమెన్ ఐసీటీ ఫ్రాంటియర్ ఇనిషియేటివ్ ఇందుకు తోడ్పాటును అందిస్తూ ఉందన్నారు. 2018 నుంచి ఇప్పటివరకూ ఈ కేంద్రం ద్వారా మూడు వేల మంది మహిళలకు శిక్షణ అందించినట్లు తెలిపారు. సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజని, డీన్ ప్రొఫెసర్ విజయలక్ష్మి, పీఆర్వో డాక్టర్ శ్రీరజని పాల్గొన్నారు.

అంతర కళాశాలల క్రీడా పోటీలు ప్రారంభం


ట్రోఫీ అందుకుంటున్న బీఎస్ఆర్ డిగ్రీకాలేజీ జట్టు- గెలుపొందిన తైక్వాండో క్రీడాకారులు

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో అంతర కళాశాలల క్రీడా పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వ్యాయామ విద్యా విభాగాధిపతి ప్రొఫెసర్ ఎం.శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పురుషుల కబడ్డీ, తైక్వాండో క్రీడా పోటీలను ఎస్వీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.భూపతినాయుడు ప్రారంభించారు. ఎస్వీయూ పరిధిలోని వివిధ కళాశాలల నుంచి కబడ్డీకి 25 జట్లు, తైక్వాండో పోటీలలో 22 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. తొలిరోజు లీగ్‌దశ కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఎస్వీయూపై బీఎస్ఆర్ డిగ్రీ కాలేజీ విజయకేతనం ఎగురవేసింది. తైక్వాండోలో ఎనిమిది మంది విజేతలుగా నిలిచారు. విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు.

ట్రాఫిక్ నియంత్రణకు ద్విచక్ర వాహనాలు


వాహనాలను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు 17 ద్విచక్ర వాహనాలను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు సోమవారం ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే విధుల్లో ఉన్న 17 వాహనాలకు అదనంగా జీపీఎస్ సిస్టం, సైరన్, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్, ఫ్లాష్‌లైట్‌తో కూడిన వాహనాలను ప్రారంభించడం శుభపరిణామమన్నారు. ఎస్పీ మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించే వాహనదారుల ఫొటోలు తీసి జరిమానా విధించడమే వీరి బాధ్యతన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



తిరుపతి(గాంధీరోడ్డు), అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన ధరణి అబాకస్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మెటర్నటీ ఆస్పత్రి వద్ద పేదలు, రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. శ్రీగాయత్రి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ నీరజాక్షులునాయుడు, డైరెక్టర్ కవిత అన్నదాన సేవ చేశారు. డైరెక్టర్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


తిరుపతి పోలీసు పరేడ్ మైదానంలో సోమవారం జరిగిన అమరవీరుల సంస్మరణ సభలో అమరవీరుల కుటుంబీకులకు సన్మానించిన లెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు,పోలీస్ అధికారులు

అమరవీరులకు ఘన నివాళి

మంగళం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): టాస్క్‌ఫోర్సు కార్యాలయంలో సోమవారం పోలీసు అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ గత ఏడాది టాస్క్‌ఫోర్సు కానిస్టేబుల్ గణేష్ మరణించడాన్ని గుర్తు చేశారు. ఈ నెల 31వ తేదీ వరకు అమరవీరులను స్మరించుకుని వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ బాలిరెడ్డి, సురేష్ కుమార్‌రెడ్డి, సీఐ సురేష్‌కుమార్, ఏసీఎఫ్ శ్రీనివాస్, ఎఫ్ఆర్వోలు మురళీకృష్ణ, ఆర్ఐ కృపానంద, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ

ఫోన్ ద్వారానే టీడీపీ సభ్యత్వం తీసుకోవచ్చు

తిరుపతి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వం పొందడం చాలా సులభమని, మొబైల్ ఫోన్ల ద్వారానే సభ్యుడిగా చేరవచ్చని ఆపార్టీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ చెప్పారు. సభ్యత్వ నమోదుపై సోమవారం ఆమె నివాసంలో పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. రూ.100 చెల్లించి పార్టీ సభ్యత్వం తీసుకుంటే ఇదివరకు రూ.2లక్షలు ఉన్న ఇన్సూరెన్స్ రూ.5 లక్షలకు పెంచినట్లు చెప్పారు. కార్యకర్తలు ఎవరైనా మృతిచెందితే అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.10వేలు ఇవ్వనున్నట్టు తెలిపారు. టెక్నాలజీని ఉపయోగించుకుని ప్రతి ఒక్కరూ ఉన్నచోట నుంచి మొబైల్, కంప్యూటర్, ట్యాబ్ ద్వారా సభ్యత్వ నమోదు చేసుకోవచ్చన్నారు. పాత సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవచ్చన్నారు. ఇప్పటివరకు కార్యకర్తలకు అందించిన సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో పార్టీ తిరుపతి నియోజకవర్గ పరిశీలకుడు చిట్టిబాబు, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు శ్రీధర్ వర్మ, చినబాబు, బుల్లెట్ రమణ, సూరా సుధాకర్ రెడ్డి, ఊట్ల సురేంద్ర నాయుడు, ఆర్సీ శ్రీనివాసులు, మన్నెం శ్రీనివాసులు నాయుడు, ఆముదాల తులసీరాం, రుద్రకోటి సదాశివం, కంకణాల రజినీకాంత్, రామ్మూర్తి రాయల్, పాటకం వెంకటేష్, బ్యాంకు శాంతమ్మ, కుమారమ్మ, అన్నా అనిత, రేవతి, పసుపులేటి శ్రీనివాసులు, మహబూబ్ బాషా, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

లీజు చెల్లించలేదని స్థలం బలవంతంగా ఖాళీ చేయించారు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): లీజు డబ్బు చెల్లించలేదని దౌర్జన్యంగా స్థలం ఖాళీ చేయించారని హిందూపురానికి చెందిన వడ్డీ యశోద తిరుపతిరూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో బాధితురాలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 2022లో గాంధీపురం వద్ద తిరుపతికి చెందిన రాజేశ్వరరావు స్థలం లీజుకు తీసుకుని పట్టుచీరల వపర్‌లూమ్‌ను యశోద ఏర్పాటు చేశారు. కొన్ని రోజులు వ్యాపారం బాగానే జరిగింది. ఇటీవల వ్యాపారంలో ఒడిదుడుకులు రావడంతో లీజు డబ్బులు చెల్లించలేదు. స్థలం యజమాని పలుమార్లు కోరినా పట్టించుకోలేదు. చివరకు లాయర్ నోటీసులు పంపారు. దానికీ యశోద స్పందించకపోవడంతో వారం రోజుల క్రితం రాజేశ్వరరావు తమ అనుచరులను పిలిపించి దౌర్జన్యంగా ఖాళీ చేయించారు. ఈ క్రమంలో అక్కడున్న రూ.50 లక్షల విలువైన మిషనరీ, వస్తువులు ధ్వంసమయ్యాయి. యశోదపైనా దాడి చేసి, పోలీసుస్టేషన్‌కు వెళ్లకుండా కొడుకుతో కలిపి నిర్బంధించారు. దీనిపై ఈనెల 18వ తేదీన యశోద తిరుపతి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కాగా, ఇదే ఘటనపై స్థలం యజమాని కూడా ఫిర్యాదు చేశారు. ఇద్దరి ఫిర్యాదులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ చిన్న గోవిందు సోమవారం తెలిపారు.

తిరుపతి

బ్యాటరీల దొంగ అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బాలాజీ కాలనీలోని జియో సెల్ టవర్ వద్ద బ్యాటరీలు దొంగిలించిన వ్యక్తిని వెస్ట్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. బాలాజీ కాలనీ ఆదిత్య టవర్స్ వద్ద నున్న ఐదు జియో బ్యాటరీలు ఇటీవల చోరీకి గురయ్యాయి. సంస్థ ప్రతినిధుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సీఐ రామకృష్ణ దర్యాప్తు చేశారు. అదే కంపెనీలో పనిచేస్తున్న టెక్నీషియన్ నరసింహులు దొంగిలించినట్లు తేలడంతో అరెస్టు చేసి, బ్యాటరీలు స్వాధీనం చేసుకున్నారు.

ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం

తిరుపతి (ఉపాధ్యాయనగర్), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా ఆర్.మురళి, ప్రధాన కార్యదర్శిగా పి. బాలచంద్ర ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సోమవారం నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా ప్రకాష్, లావణ్యకుమార్, కోశాధికారిగా చంద్రబాబు, సంయుక్త కార్యదర్శులుగా జగదీష్, మాధవ్, చెంచుబత్తయ్య విజయం సాధించారు. ఈసీ మెంబర్లకు సంబంధించిన కౌంటింగ్ సోమవారం రాత్రి కూడా కొనసాగింది. మంగళవారం ఫలితాలను ప్రకటిస్తారు.

ఎన్నికల బరిలో 35 మంది

తిరుపతి(ఆటోనగర్) అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో 35మంది అభ్యర్థులు బరిలో నిలిచినట్లు ఎన్నికల అధికారి ఉమాపతి తెలిపారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణలో భాగంగా 43 మందిలో ఎనిమిది మంది ఉపసంహరించుకున్నారని పేర్కొన్నారు. 35 మంది ఎన్నికల బరిలో ఉన్నారని తెలిపారు.

తిరుమలలో అధునాతన ట్రాఫిక్ వ్యవస్థ

● టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి



మొబైల్ ట్రాఫిక్ ద్విచక్రవాహనాలను ప్రారంభిస్తున్న అదనపు ఈవో, ఎస్పీ

తిరుమల, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): తిరుమలలో అధునాతన ట్రాఫిక్ వ్యవస్థ అమలు చేస్తున్నట్టు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి చెప్పారు. ట్రాఫిక్ సమస్యలో నియంత్రణలో భాగంగా ఆధునీకరించిన 12 ద్విచక్రవాహనాలను సోమవారం ఎస్పీ సుబ్బరాయుడితో కలిసి ఆయన ప్రారంభించారు. వాహనాలకు జెండా ఊపారు. అనంతరం అదనపు ఈవో మీడియాతో మాట్లాడుతూ.. కొండపై ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకూడదనే మొబైల్ ట్రాఫిక్ ద్విచక్రవాహనాలను ప్రారంభించామన్నారు. నిర్దేశిత పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలను మళ్లిస్తే ఎలాంటి ట్రాఫిక్ సమస్య ఉండదన్నారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ డీసీపీగా పనిచేసిన ఎస్పీ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకున్నామన్నారు. ట్రాఫిక్ సమస్యలపై అధ్యయనం చేసేందుకు ఇప్పటికే టీటీడీ, పోలీసులతో కలిపి కమిటీని ఏర్పాటు చేశామన్నారు. మూడురోజులుగా అమలు చేస్తున్న విధానం ద్వారా ట్రాఫిక్ సమస్యలు తగ్గాయన్నారు. త్వరలో దీర్ఘకాలిక ప్రణాళికలను కూడా రూపొందించి చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పీ మాట్లాడుతూ తిరుమలను ఐదు జోన్లుగా విభజించి ప్రతి జోన్‌కు ఒక మొబైల్ ట్రాఫిక్ వాహనం నిరంతరాయంగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీని ద్వారా ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు రావని అభిప్రాయపడ్డారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలు, వ్యక్తుల ఫొటోలు తీసి పోలీస్ కంట్రోల్ రూమ్ ద్వారా జరిమానాలు విధిస్తామన్నారు. తిరుమలలో ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి తప్పించుకుని వెళ్లినా అలిపిరిలో అడ్డుకుని ఫైన్ విధిస్తామన్నారు.

సముచితమైన పంచాంగం రూపొందించాలి

● దేవప్రయాగ క్యాంపస్ డైరెక్టర్ సుబ్రమణ్యం



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ సుబ్రమణ్యం, వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి

తిరుపతిరూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పంచాంగంపై విశేష పరిశోధన చేసి, అందరికీ సముచితమైన పంచాంగాన్ని రూపొందించాలని ఉత్తరఖండ్‌కు చెందిన సెంట్రల్ సంస్కృత వర్సిటీ దేవప్రయాగ క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ పీవీబీ సుబ్రమణ్యం తెలిపారు.

తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో జ్యోతిష్య విభాగం ఆధ్వర్యంలో పంచాంగ నిర్మాణం కోసం నిర్వహిస్తున్న మూడ్రోజుల జాతీయ సదస్సును సోమవారం వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తితో కలసి ఆయన ప్రారంభించారు. సుబ్రమణ్యం మాట్లాడుతూ పంచాంగ రూపకల్పనకు వర్సిటీ ముందుకురావడం ఆహ్వానించదగ్గ పరిణామమని, ఈ లక్ష్యంతో చర్చాగోష్ఠి నిర్వహించడం సంతోషదాయకమని తెలిపారు. వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ సుప్రసిద్ధ జ్యోతిష్య విద్వాంసులు, పంచాంగకర్తల సలహాలు, సూచనల ప్రకారం వర్సిటీ నూతన పంచాంగాన్ని రూపొందిస్తున్నామని వివరించారు. జ్యోతిష్య శాస్త్ర ప్రొఫెసర్ రాధాకాంత ఠాకూర్ మాట్లాడుతూ సామాజికంగా ఉపయోగపడే అనేక అంశాలపై పనిచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అకడమిక్‌డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్‌శుక్లా, వేదవేదాంగ డీన్ ప్రొఫెసర్ కృష్ణేశ్వరఝా, కోఆర్డినేటర్లు డాక్టర్ చిత్తరంజన్ నాయక్, డాక్టర్ కృష్ణకుమార్ భార్గవ్, బాలాక్రామ్ సారస్వత్, ధర్మదాసన్, 25మందికిపైగా పంచాంగకర్తలు పాల్గొన్నారు.

30న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కోదండరామాలయంలో ఈ నెల 30వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నట్లు టీటీడీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. 31వ తేదీ దీపావళి ఆస్థానాన్ని పురస్కరించుకుని ముందురోజు ఆలయ శుద్ధి చేపట్టనున్నట్లు పేర్కొంది. మంగళవారం వేకువజామున సుప్రభాత సేవ తర్వాత తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం నిర్వహిస్తారని, 7 నుంచి 10 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగుతుందని వివరించింది. ఉదయం 11 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారని వెల్లడించింది.

దీపావళి ఆస్థానం: దీపావళి పండగ సందర్భంగా 31వ తేదీ రాత్రి 7 గంటలకు గోవిందరాజస్వామి ఆలయం నుంచి నూతన వస్త్రాలు, దోశపడి, దీపాలు కోదండరామస్వామికి సమర్పిస్తారు. ఈ సందర్భంగా ప్రతి అమావాస్యకూ ఆలయంలో నిర్వహించే సహస్ర కలశాభిషేకం, హనుమంత వాహన సేవలను రద్దు చేస్తున్నట్టు టీటీడీ తెలిపింది.

రాజగోపాల నాయుడికి నివాళి

తవణంపల్లె, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, గల్లా అరుణకుమారి తండ్రి, మాజీ ఎంపీ పాటూరు రాజగోపాల్ నాయుడి వర్ధంతిని మండలంలోని దిగువమాఘం రాజన్న పార్కులో సోమవారం ఘనంగా నిర్వహించారు. గల్లా అరుణకుమారి, అమరరాజా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వ్యవస్థాపక చైర్మన్ గల్లా రామచంద్ర నాయుడు, ఆయన కుమార్తె డాక్టర్ రమాదేవి పార్కులో గల రాజగోపాల నాయుడి విగ్రహానికి పూలమాలలు వేసి, పూజలు నిర్వహించి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోపి, మాజీ సర్పంచ్ కుమార్ నాయుడు, రాజన్న ఫౌండేషన్ నిర్వాహకులు సతీష్, సురేష్, దిగువమాఘం గ్రామస్తులు పాల్గొన్నారు.



రాజగోపాల నాయుడికి నివాళులర్పిస్తున్న గల్లా దంపతులు

మార్కెట్లోకి బజాజ్ ఫ్రీడమ్ సీఎన్జీ



బైక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుపతి అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తాజా సాంకేతిక పరిజ్ఞానంతో తయారుచేసిన బజాజ్‌ఫ్రీడమ్ సీఎన్జీ ద్విచక్ర వాహనాన్ని సోమవారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మార్కెట్లోకి విడుదల చేశారు. తిరుపతి-రేణిగుంట ప్రధాన రహదారిలోని శ్రీరామ్‌బజాజ్ ఆటోమొబైల్ షోరూంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ తొలిసారిగా గ్యాస్‌తో నడిచే వాహనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం సంతోషమన్నారు. తొలిరోజు కొనుగోలు చేసిన ముగ్గురు కస్టమర్లకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బైక్ తాళాలను అందజేశారు. సంస్థ ఎండీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ మోడల్ బైక్ ద్వారా ఇంధనం ఖర్చు సగానికి సగం తగ్గించవచ్చని, దీని ధర రూ.95వేలు మాత్రమేనని అన్నారు. కార్యక్రమంలో సేల్స్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ ఎన్ఎస్వీబీఆర్ ప్రసాద్, సంస్థ ఎండీలు సాకేత్‌రామ్, అభిరామ్ పాల్గొన్నారు.

పోలీసు పీజీఆర్ఎస్‌కు 66 అర్జీలు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 66 అర్జీలు అందాయి. అదనపు ఎస్పీ వెంకట్రావు ఆధ్వర్యంలో పోలీసులు ఫిర్యాదుదారుల నుంచి వినతులు స్వీకరించారు. తక్షణం పరిష్కరించే దిశగా ఏఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

అర్జీలు స్వీకరించిన ఎంహెచ్‌వో



తిరుపతి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్‌తో పాటు ఏడీసీ, ఏసీ అధికారులు ఢిల్లీ పర్యటనకు వెళ్లడంతో హెల్త్ ఆఫీసర్ గ్రీవెన్స్‌లో పాల్గొన్నారు. 32అర్జీలు వచ్చాయి. వర్షాలుకురుస్తున్న సమయంలో పారిశుధ్యం మరింత మెరుగ్గా చేపట్టాలని, ఈఎస్ఐ హాస్పిటల్ వద్ద రోడ్డు పక్కన మద్యం తాగుతున్నారని, అరికట్టాలని పలువురు అర్జీలు అందించారు. వినతులను హెల్త్ ఆఫీసర్ క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వినతులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, సెక్రటరీ రాధిక, ఏసీపీ బాలాజీ, రమణ, ఆర్వోలు సేతుమాధవ్,రవి, మేనేజర్ హసీమ్ ఉన్నారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థిని టి.శ్రీలక్ష్మి జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల ఏలూరు జిల్లాలో జరిగిన 68 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర జిల్లాల సాఫ్ట్‌బాల్ అండర్ 19 రాష్ట్రస్థాయి పోటీలలో శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు. ఇందులో టి.లక్ష్మి, ఎం.నిఖిత. పి.తనూజ గెలుపొందారు. మొదటిస్థానం కైవసం చేసుకున్న టి.లక్ష్మి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. సోమవారం సాయంత్రం జరిగిన అభినందన సభలో విద్యార్థినితో పాటు ఫిజికల్ డైరెక్టర్ సాయిసుమతిని ప్రశంసించారు.



ప్రశంసాపత్రాలతో విజేతలు

కష్టపడిన వారికి పదవులు



← ఎమ్మెల్సీ హరిప్రసాద్‌ను సన్మానిస్తున్న కిరణ్‌రాయల్

తిరుపతి అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పార్టీ కోసం కష్టపడిన వారికి పదవులు దక్కుతాయని జనసేన ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం శ్రీవారి దర్శనార్థం తిరుమల వచ్చిన ఆయన్ను విశ్రాంతి గృహంలో పార్టీ తిరుపతి ఇన్‌చార్జ్ కిరణ్‌రాయల్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. పార్టీ బలోపేతం దిశగా కృషి చేయాలని హరిప్రసాద్ సూచించారు.



బతుకు 'ఊయల'

అటు బండిపై టిఫిన్ అంగడి. ఇటు ఊయలలో బిడ్డ. బతుకు పనులు చూసుకుంటూ.. ఊయలలో ఏడిచే బిడ్డను సముదాయించేందుకు ఆ తల్లి పడుతున్న వేదన అక్కడి వారిని కదిలించింది. కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన నాగరాజు దంపతులు ఏడేళ్ల క్రితం తిరుపతికి వలసొచ్చారు. తిమ్మినాయుడు పాళెం రోడ్డు మలుపువద్ద ఉదయం, సాయంత్రం టిఫిన్ బండి పెట్టుకుంటున్నారు. దీని పక్కనే ఫ్లెక్సీ కోసం ఏర్పాటుచేసిన ఇనుపకమ్మీ, విద్యుత్ స్తంభానికి చీరతో ఊయల కట్టి రెండో కొడుకును పడుకోబెట్టి.. ఆడించుకుంటూ వ్యాపారం చేసుకుంటున్నారామె. - తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

నడిరోడ్డుపైనే 'సిట్టింగ్'

ఎక్కడా చోటే లేదన్నట్లు, నడిరోడ్డుపైనే సిట్టింగ్ వేశారు మందుబాబులు. తిరుపతి రూరల్ మంగళం పరిధిలోని తుడా క్వార్టర్స్‌కు వెళ్లే దారిలో సోమవారం మధ్యాహ్నం ఇలా మద్యం సీసాలు, స్నాక్స్ తెచ్చుకుని తాగడం మొదలు పెట్టారు. ఆ సమయంలో రాకపోకలు సాగించేవారు ఇబ్బంది పడ్డారు. ఒకరిద్దరు అడిగితే.. ఎదురుతిరిగారు. మందుబాబులతో గొడవ ఎందుకని వారు వెళ్లిపోయారు. ప్రతి రోజు ఇక్కడ మందుబాబుల వీరంగం ఉంటోందని, స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి



కలెక్టరేట్‌లో 'వర్మీకంపోస్టు'



తిరుపతి కలెక్టరేట్‌లో సోమవారం ఏర్పాటు చేసిన స్టాల్‌లో వర్మీ కంపోస్టు ప్యాకెట్లను విక్రయించారు. దీనిని పండ్లు, కూరగాయల మొక్కలకు ఎరువుగా వాడుకోవచ్చని ప్రజలు దీనిని ఆదరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. కరకంబాడీ పంచాయతీ నుంచి వర్మీ కంపోస్టును ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నామన్నారు. డీపీవో సుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి

అమ్మ..నాన్న.. తిరుమలా..!

'విశ్వం' సినిమా విజయానందాన్ని తిరుమల శ్రీనివాసుడితో పంచుకోవడానికి తిరుమలకు వచ్చారు దర్శకుడు శ్రీను వైట్ల. వెంకీ, దూకుడు, ఆగడు, బాద్‌షా, ఢీ, రెడీ, కింగ్, దుబాయ్ శీను.. వంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకుల్లో ప్రత్యేక స్థానం సంపాయించుకున్న ఆయనతో తిరుమలలో ఆంధ్రజ్యోతి ప్రతినిధి సంభాషణలోని ముఖ్యాంశాలు..

- తిరుమల, ఆంధ్రజ్యోతి

● స్వామితో గొప్ప అనుబంధం నాది అంటున్న దర్శకుడు శ్రీను వైట్ల



తిరుమల నా ఇల్లు అనిపిస్తుంది

నాకు ఊహ తెలియకముందు అమ్మానాన్నలు తిరుమలకు తీసుకువచ్చారు. పదిహేనేళ్ల వయసు నుంచీ నా తిరుమల ప్రయాణాలన్నీ నాకు గుర్తున్నాయి. నా సొంత ఇంటికి వచ్చిన ఫీలింగ్ కలుగుతుంది ఇక్కడికి రాగానే. నాకు తెలిసి ప్రతి మనిషికి తిరుమలతో ప్రత్యేక అనుబంధం ఉంటుంది. నా పేరు కూడా శ్రీనివసే! ఇక్కడికి రాగానే ఇతర విషయాలన్నీ మరచిపోతాను. స్వామిని దర్శించుకోగానే ఒక పాజిటివ్ ఎనర్జీ వస్తుంది. నా మనసు బాగాలేనపుడు తిరుమలకు వెళ్తే బావుండునని పిస్తుంది. నేను చేసే ప్రతి పనీ స్వామికి చెప్పి చేయడం అలవాటైపోయింది. నేను చేపట్టిన పని విజయవంతం కావాలని ప్రార్థిస్తుంటా. మనకే దన్నా కావాలన్నా, ఏదన్నా చెప్పుకోవాలన్నా తల్లిదండ్రులే గుర్తుకొస్తారు. నాకు శ్రీవేంకటేశ్వరస్వామి గుర్తుకొస్తాడు. ఆయనతోనే అన్నీ పంచుకుంటా.

స్వామికి థ్యాంక్స్ చెప్పేందుకు వచ్చాం

ఇటీవల విడుదలైన 'విశ్వం' సినిమా మంచి విజయాన్ని సాధించింది. చాలా గ్యాప్ తర్వాత అత్యంత జాగ్రత్తగా తీసిన సినిమా విశ్వం. చాలా సంతోషంగా ఉంది. స్వామికి థ్యాంక్ చెప్పేందుకు వచ్చాం.

ప్రసాదాలు అద్భుతం

ప్రసాదాల విషయంలో గతంలో కొంత అసంతృప్తిగా అనిపించింది, ప్రస్తుతం చాలా బాగున్నాయ్. దర్శనం కాగానే ప్రసాదాలు తీసుకున్నా. అద్భుతంగా అనిపించింది.

మాటే మంత్రమైంది

'విశ్వం' విడుదలైన తర్వాత రివ్యూలు అటుఇటుగా వచ్చాయి. అవన్నీ వ్యక్తుల అభిప్రాయాలు. కానీ ప్రేక్షకుల నోటి మాట ఎంత బలంగా ప్రచారం అయిందంటే.. విడుదలైనప్పటి నుంచి కలెక్షను ఏమాత్రం తగ్గడం లేదు. అదనంగా మరో 300 థియేటర్లు పెరగడం అనేది మామూలు విషయం కాదు. మంచి మాటే మంత్రంలా పనిచేసింది. మంచి సినిమాను శ్రీవేంకటేశ్వరస్వామే కాపాడారు. గోపిచంద్‌తో సహా పృథ్వీ, సునీల్, వెన్నల కిషోర్ అందరూ పర్ఫెక్ట్‌గా చేశారు.

తర్వాతి చిత్రం కామెడీనే

విశ్వం సినిమా హిట్ కావడానికి ప్రధాన కారణం కామెడీనే అంటున్నారు. నా నుంచి ఫుల్ లెంగ్త్ కామెడీ సినిమాలే ప్రేక్షకులు కోరుకుంటున్నారు. నా తర్వాతి చిత్రం ఫుల్ లెంగ్త్ కామెడీతోనే ఉంటుంది. అందరినీ మనసారా నవ్వించగలుగుతున్నానంటే అది నా అదృష్టం.

శ్రీవారి ఆలయానికి సమీపంలో ప్రయాణించిన హెలికాప్టర్



తిరుమల, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయానికి సమీపంలో సోమవారం ఓ హెలికాప్టర్ ప్రయాణించడం కలకలం సృష్టించింది. సాధారణంగా ఆలయ ఆగమ శాస్త్రం ప్రకారం గర్భాలయం పైభాగంలో విమానాల రాకపోకలుండకూడదు. అయితే కొద్ది నెలలుగా తిరుమల క్షేత్రం మీదుగా విమానాలు, హెలికాప్టర్లు ప్రయాణిస్తూనే ఉన్నాయి. దీనిపై ఇప్పటికే పలుమార్లు అర్చకులు, ఆగమ పండితులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. తిరుమలను నోఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించాలని టీటీడీ గతంలో అనేకసార్లు కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. అయితే నోఫ్లయింగ్ జోన్‌గా తిరుమలను ప్రకటించడం సాధ్యం కాదని కేంద్రమూ స్పష్టం చేసింది. కానీ భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని వీలైనంతవరకు తిరుమల క్షేత్రం మీదుగా విమానాలు, హెలికాప్టర్లు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటుంటారు. అయితే ఇటీవల తిరుమలపై విమానాలు ప్రయాణిస్తూనే ఉన్నాయి. తాజాగా సోమవారం ఉదయం 10.30 గంటల సమయంలో హెలికాఫ్టర్ భారీ శబ్దంతో ప్రయాణించడంతో మళ్లీ నో ఫ్లయింగ్ జోన్ అంశం తెరపైకి వచ్చింది. ఈ హెలికాప్టర్‌పై ఉన్న లోగోను పరిశీలిస్తే ఇండియన్ ఆర్మీకి సంబంధించినదిగా తెలుస్తోంది. దీంతో టీటీడీ అధికారులు మౌనంగా ఉండిపోయారు.

193కి 131 భూ సమస్యలే

● సమస్యల పరిష్కారానికి నిరసనలు, ఫిర్యాదులు

● పీజీఆర్ఎస్‌కు తరలి వచ్చిన జనం

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)'కు 193 అర్జీలు వచ్చాయి. వీటిలో 131 రెవెన్యూకు సంబంధించి భూ సమస్యలే ఉన్నాయి. ప్రతి అర్జీని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, సెప్షల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, నరసింహులు ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇక, ప్రజా సమస్యలు పరిష్కరించాలని, ఉద్యోగులు న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలంటూ పలువురు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. మిగతా వారు అధికారులకు వినతిపత్రాలిచ్చారు.

విద్యాసంస్థల ఆవరణలో మద్యం షాపులు తొలగించండి

తిరుపతి నగరం ఎంఆర్‌పల్లె విద్యాసంస్థల సమీపంలో ఉన్న మద్యం దుకాణాలు తొలగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్ రవి కోరారు. ఎంఆర్‌పల్లి, సీతంరోడ్డు సమీపంలో నిబంధనలు ఉల్లంఘించి విద్యాసంస్థల సమీపంలో మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారన్నారు. దీనివల్ల విద్యార్థుల భద్రతకు ఇబ్బంది కలుగుతుందన్నారు. దీనిపై పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఎక్సైజ్ అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వినోద్, అశోక్, నరేంద్ర, హర్షద్ తదితరులు పాల్గొన్నారు.





డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న 108 ఉద్యోగులు

జీతాల చెల్లింపుల్లో జాప్యం

ఏఈఎమ్ఎస్ సంస్థ 108 నిర్వహణ బాధ్యతలు చేపట్టాక ప్రతి నెలా జీతాల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోందని 108 ఉద్యోగులు, సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు. రెండు నెలలుగా జీతాలు చెల్లించలేదన్నారు. ఇలాగైతే కుటుంబాలను ఎలా పోషించాలని వారు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు డీఎంహెచ్‌వో శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. నాలుగురోజులుగా ఏఈఎంఎస్ సంస్థ ఉద్యోగులకు ఒక ఇంక్రిమెంట్ మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. 108 సర్వీసులో ఉన్న ఉద్యోగులకు(ఎంటీటీ, పైలెట్) ఆరోగ్యశాఖ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. 8 గంటల పనివిధానాన్ని అమలు చేయాలన్నారు. ఇక 108 వాహనాలకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే నేటి నుంచి నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 108 జిల్లా ప్రధాన కార్యదర్శి మునిరాజా, అధ్యక్షుడు మహేష్, ఉపాధ్యక్షుడు శ్యామ్, మహిళా నాయకురాలు శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమించిన ఈసీఎల్‌పై చర్యలు తీసుకోండి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న చిందేపల్లి గ్రామస్థులు

ఏర్పేడు మండలం చిందేపల్లికి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డును అక్రమంగా మూసివేసిన ఈసీఎల్ యాజమాన్యంపై చర్యలు తీసుకుని.. ఆ రోడ్డును తమకు వదిలిపెట్టాలని ఆ గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చిందేపల్లె గ్రామానికి పూర్వీకుల నుంచి పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి నుంచి రాచగున్నేరి పంచాయతీ ఛటర్జీ నగర్‌మీదుగా 40 అడుగుల రోడ్డు ఉందన్నారు. ప్రస్తుతం ఈ రోడ్డును ఈసీఈఎల్ యాజమాన్యం మూసేసి తమను అడ్డుకుంటోందని, ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని వాపోయారు. గ్రామస్థులు వెంకయ్య, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందిని పంచాయతీకి అనుసంధానించండి

గ్రామ పంచాయతీకి ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి అందులోని సిబ్బందిని పంచాయతీకి అనుసంధానం చేయాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్బరామయ్య, కిరణ్‌యాదవ్ తదితరులు కోరారు. కలెక్టరేట్ వద్ద వీరు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చినా.. పర్యవేక్షణ, నియంత్రణ లేకపోవడంతో గందరగోళం ఏర్పడిందన్నారు. చాలా పంచాయతీల్లో రెండు నుంచి 5 సచివాలయాలను ఏర్పాటు చేశారని, అవసరానికిమించి ఉద్యోగులు ఉన్నారన్నారు. అలా కాకుండా గ్రామపంచాయతీకి ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి, అక్కడి సిబ్బందిని పంచాయతీకి అనుసంధానం చేయాలన్నారు.



ముగిసిన టెట్

● చివరి రోజు అభ్యర్థులకు కష్టాలు

● 16 రోజులుగా 9 కేంద్రాల్లో పరీక్షలు



పరీక్ష కేంద్రం వెనుక ప్రవేశ మార్గం వద్ద అభ్యర్థులు

తిరుపతి విద్య, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 16 రోజులుగా సాగిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) సోమవారంతో ముగిసింది. జిల్లావ్యాప్తంగా 9 కేంద్రాల్లో ఈ నెల 3 నుంచి 21వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించారు. 36,759 మంది నమోదు చేసుకోగా 31,840 మంది హాజరయ్యారు. 4,919 మంది గైర్హాజరయ్యారు. సోమవారం జిల్లాలోని మూడు కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. నాగలాపురం శ్రీవెంకటపెరుమాళ్ ఇంజినీరింగ్ కళాశాల, రంగంపేట, రామిరెడ్డిపల్లెలోని అయాన్ డిజిటల్ జోన్, తిరుపతి చెర్లోపల్లిలోని అయాన్ డిజిటల్ జోన్ కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. 1,507 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 1,299 మంది పరీక్షలకు హాజరయ్యారు. 208 మంది గైర్హాజరయ్యారు.



పరీక్ష కేంద్రం ఎదుట ప్రధాన మార్గాలను మూసేయడంతో ఖాళీగా ఉన్న ప్రధాన ప్రవేశ మార్గాలు

అభ్యర్థులకు కష్టాలు

టెట్ పరీక్షల చివరి రోజున తిరుపతి చెర్లోపల్లి అయాన్ డిజిటల్ జోన్‌లో అభ్యర్థులకు కష్టాలు ఎదురయ్యాయి. అనంతపురం, కడప, కదిరి, ధర్మవరం, పుట్టపర్తి, కర్నూలు, నంద్యాల తదితర ప్రాంతాల నుంచి అభ్యర్థులు వచ్చారు. సెల్‌ఫోన్లు, బ్యాగ్‌లను భద్రపరిచేందుకు వేర్వేరు కౌంటర్లు ఏర్పాటు చేయడంతో అభ్యర్థులు రెండుచోట్ల క్యూలలో గంటలకొద్దీ వేచి ఉండాల్సి వచ్చింది. పరీక్ష కేంద్రంలోకి రెండు ప్రవేశ మార్గాలు ఉన్నప్పటికీ కేంద్ర వెనుకవైపున్న ఓ చిన్నపాటి మార్గంలోంచి ప్రవేశం కల్పించడంతో అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రంలో తాగునీరు పెట్టలేదని తెలిపారు. పరీక్ష జరుగుతున్న సమయంలో అధికారులు మైకులో సూచనలు చేయడం ఏకాగ్రతకు భంగం కలిగించిందని, సిబ్బంది తమపట్ల దురుసుగా వ్యవహరించారని ఆరోపించారు.

వైసీపీ ఎమ్మెల్సీ దందా కేసు విచారణ వేగవంతం

తిరుమల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లను అధిక ధరకు విక్రయించిన కేసు విచారణ వేగవంతంగా జరుగుతోంది. వైసీపీ ఎమ్మెల్సీ జకియా ఖానం బెంగళూరుకు చెందిన భక్తులకు వీఐపీ బ్రేక్ దర్శనం చేయించిన ఘటన ఆదివారం వెలుగుచూసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో విజిలెన్స్ వింగ్ అధికారులు నివేదిక మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఏ1గా చంద్రశేఖర్, ఏ2గా జకియా ఖానం, ఏ3గా కృష్ణతేజను చేర్చారు. ఈక్రమంలో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈకేసులో ఇంకా ఎవరైనా ఉన్నారా, ఎమ్మెల్సీ సిఫార్సులపై ఇంకా ఏవైనా అక్రమాలు జరిగాయా, ఎంత కాలం నుంచి ఇలాంటి అక్రమాలు జరుగుతున్నాయనే అంశాలపై పోలీసులు గోప్యంగా విచారణ చేస్తున్నారు.

డీఎస్సీ శిక్షణ దరఖాస్తులకు గడువు పొడిగింపు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు సంయుక్తంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్సీ విధానంలో ఇస్తున్న ఉచిత డీఎస్సీ శిక్షణ దరఖాస్తులకు ఈనెల 25వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారిత అధికారి చెన్నయ్య సోమవారం తెలిపారు. అభ్యర్థులు జ్ఞాన భూమి పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

శ్రీసిటీలో ఇద్దరు కార్మికుల మధ్య ఘర్షణ

● ఒకరి మృతి



ముర్ము మృతదేహం

వరదయ్యపాలెం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ చెరివి గ్రామ సమీపంలో మద్యం మత్తులో ఇద్దరు కార్మికుల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలో జార్ఖండ్ రాష్ట్రం బత్వా గ్రామానికి చెందిన షికారీ ముర్ము(39) మృతి చెందాడు. శ్రీసిటీ సీఐ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం.. శ్రీసిటీ పరిధిలో చెరివికి సమీపంలో ఓ కంపెనీ నడుస్తోంది. దీని పక్కనే షెడ్లలో జార్ఖండ్, ఇతర ప్రాంతాలకు చెందిన కార్మికులు నివసిస్తుంటారు. ఈ షెడ్లలో నివసిస్తున్న కాంటాక్టు కార్మికుడు షికారి ముర్ము.. అక్కడే ఉన్న మరో కార్మికుడు విక్రమ్ ముర్ము తల్లిని దూషించాడు. దీనిపై అతడు షికారి ముర్ముతో ఆదివారం రాత్రి ఘర్షణ పడ్డాడు. ఇద్దరు తాగిన మైకంలో కిందపడ్డారు. విక్రమ్‌ముర్ము కొట్టిన దెబ్బలకు షికారి ముర్ము మృతి చెందాడు. సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ హరిప్రసాద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

30న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 21(ఆంధ్రజ్యోతి): కోదండరామాలయంలో ఈ నెల 30న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నట్లు టీటీడీ తెలిపింది. 31వ తేదీ దీపావళి ఆస్థానాన్ని పురస్కరించుకుని ముందురోజు ఆలయ శుద్ధి చేపట్టనున్నట్లు పేర్కొంది. మంగళవారం వేకువజామున సుప్రభాత సేవ తర్వాత తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం నిర్వహిస్తారని, 7 నుంచి 10 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగుతుందని వివరించింది. ఉదయం 11 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారని వెల్లడించింది.

దీపావళి ఆస్థానం

దీపావళి పండగ సందర్భంగా 31వ తేదీ రాత్రి 7 గంటలకు గోవిందరాజస్వామి ఆలయం నుంచి నూతన వస్త్రాలు, దోశపడి, దీపాలు కోదండరామస్వామికి సమర్పిస్తారు. ప్రతి అమావాస్యకూ ఆలయంలో నిర్వహించే సహస్ర కలశాభిషేకం, హనుమంత వాహన సేవలను రద్దు చేస్తున్నట్లు టీటీడీ తెలిపింది.

బ్యాటరీల దొంగ అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బాలాజీ కాలనీలోని జియో సెల్ టవర్ వద్ద బ్యాటరీలు దొంగిలించిన వ్యక్తిని తిరుపతి వెస్ట్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. బాలాజీ కాలనీ ఆదిత్య టవర్స్ వద్దనున్న ఐదు జియో బ్యాటరీలు ఇటీవల చోరీకి గురయ్యాయి. సంస్థ ప్రతినిధుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సీఐ రామకృష్ణ దర్యాప్తు చేశారు. అదేకంపెనీలో పనిచేస్తున్న టెక్నీషియన్ నరసింహులు దొంగిలించినట్లు తేలడంతో అరెస్టు చేసి, బ్యాటరీలు స్వాధీనం చేసుకున్నారు.

రబీ పనులు షురూ



గూడలి వద్ద నాట్లు వేసేందుకు ట్రాక్టర్‌తో అడుసు దున్నుతున్న రైతు



కొక్కుపాడు వద్ద వరినారు

కోట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రబీ సీజన్ వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. స్వర్ణముఖినది పరివాహక గ్రామాల్లోని రైతులు ఫిల్టర్ పాయింట్‌ల కింద పొలాల్లో అడుసు దుక్కి చేస్తున్నారు. కొందరు నారుమడులు పోసుకొని నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పలు చెరువుల్లో నీరు చేరడం, మును ముందు వర్షాలు పడుతాయన్న నమ్మకంతో చెరువుల కింద ఆయకట్టు రైతులు నారుమడులు పోసుకుంటున్నారు. ప్రధానంగా గూడలి, దక్షిణపొలం, తిన్నెలపూడి, కాకితోపు, వెంకన్నపాళెం, రంగన్న గుంట, తిమ్మానాయుడుపాళెం, వంజివాక తదితర గ్రామాల్లోని రైతులు ఫిల్టర్ పాయింట్ ద్వారా నార్లు పోసుకొని నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. అదేవిధంగా ఊనుగుంటపాళెం, రుద్రవరం, చిట్టెడు, చెందోడు, చంద్రశేఖరపురం, నెల్లూరుపల్లి కొత్తపాళెం, వీపీ అగ్రహం, జరుగుమల్లి, కర్లపూడి గ్రామాల రైతులు చెరువుల కింద నార్లు పోసుకుంటుండగా, కొంత మంది చెరువుల్లో ఉన్న నీటితోనే నాట్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

సముచితమైన పంచాంగం రూపొందించాలి

దేవప్రయాగ క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సుబ్రమణ్యం



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ సుబ్రమణ్యం, వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి

తిరుపతి రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పంచాంగంపై విశేష పరిశోధన చేసి, అందరికీ సముచితమైన పంచాంగాన్ని రూపొందించాలని ఉత్తరఖండ్‌కు చెందిన సెంట్రల్ సంస్కృత వర్సిటీ దేవప్రయాగ క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ వీవీబీ సుబ్రమణ్యం తెలిపారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో జ్యోతిష్య విభాగం ఆధ్వర్యంలో పంచాంగ నిర్మాణం కోసం నిర్వహిస్తున్న మూడ్రోజుల జాతీయ సదస్సును సోమవారం వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తితో కలసి ఆయన ప్రారంభించారు. సుబ్రమణ్యం మాట్లాడుతూ పంచాంగ రూపకల్పనకు వర్సిటీ ముందుకురావడం ఆహ్వానించదగ్గ పరిణామమని, ఈ లక్ష్యంతో చర్చాగోష్ఠి నిర్వహించడం సంతోషదాయకమని తెలిపారు. వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ సుప్రసిద్ధ జ్యోతిష్య విద్వాంసులు, పంచాగకర్తల సలహాలు, సూచనల ప్రకారం వర్సిటీ నూతన పంచాంగాన్ని రూపొందిస్తున్నామని వివరించారు. జ్యోతిష్య శాస్త్ర ప్రొఫెసర్ రాధాకాంతఠాకూర్ మాట్లాడుతూ సామాజికంగా ఉపయోగపడే అనేక అంశాలపై పనిచేస్తున్నామని తెలిపారు. అకడమిక్‌డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్‌శుక్లా, వేదవేదాంగ డీన్ ప్రొఫెసర్ కృష్ణేశ్వర ఝూ, కోఆర్డినేటర్లు డాక్టర్ చిత్తరంజన్‌నాయక్, డాక్టర్ కృష్ణకుమార్ భార్గవ్, బాలాక్రామ్ సారస్వత్, ధర్మదాసన్, 25మందికిపైగా పంచాంగకర్తలు పాల్గొన్నారు.

ఫోన్ ద్వారానే టీడీపీ సభ్యత్వం తీసుకోవచ్చు: మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న సుగుణమ్మ

తిరుపతి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వం పొందడం చాలా సులభమని, మొబైల్ ఫోన్ల ద్వారానే సభ్యుడిగా చేరవచ్చని ఆ పార్టీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ చెప్పారు. సభ్యత్వ నమోదుపై సోమవారం ఆమె నివాసంలో పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. రూ.100 చెల్లించి పార్టీ సభ్యత్వం తీసుకుంటే ఇదివరకు రూ.2లక్షలు ఉన్న ఇన్సూరెన్స్ రూ.5 లక్షలకు పెంచినట్లు చెప్పారు. కార్యకర్తలు ఎవరైనా మృతిచెందితే అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.10వేలు ఇవ్వనున్నట్టు తెలిపారు. టెక్నాలజీని ఉపయోగించు కుని ప్రతి ఒక్కరూ ఉన్నచోట నుంచి మొబైల్, కంప్యూటర్, ట్యాబ్ ద్వారా సభ్యత్వ నమోదు చేసుకోవచ్చన్నారు. పాత సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవచ్చన్నారు. ఇప్పటివరకు కార్యకర్తలకు అందించిన సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో పార్టీ తిరుపతి నియోజకవర్గ పరిశీలకుడు చిట్టిబాబు, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు శ్రీధర్ వర్మ, చినబాబు, బుల్లెట్ రమణ, సూరా సుధాకర్ రెడ్డి, ఊట్ల సురేంద్ర నాయుడు, ఆర్సీ శ్రీనివాసులు, మన్నెం శ్రీనివాసులు నాయుడు, ఆముదాల తులసీరాం, రుద్రకోటి సదాశివం, కంకణాల రజినీకాంత్, రామ్మూర్తి రాయల్, పాటకం వెంకటేష్, బ్యాంకు శాంతమ్మ, కుమారమ్మ, అన్నా అనిత, రేవతి, పసుపులేటి శ్రీనివాసులు, మహబూబ్ బాషా,రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు 17 ద్విచక్ర వాహనాలు



వాహనాలను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు 17 ద్విచక్ర వాహనాలను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు సోమవారం ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే విధుల్లో ఉన్న 17 వాహనాలకు అదనంగా జీపీఎస్ సిస్టం, సైరన్, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్, ఫ్లాష్‌లైట్‌తో కూడిన వాహనాలను ప్రారంభించడం శుభపరిణామమన్నారు. ఎస్పీ మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించే వాహనదారుల ఫొటోలు తీసి జరిమానా విధించడమే వీరి బాధ్యతన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

పల్లెసీమలను ప్రగతి బాటలో నడిపిస్తాం: పాశం



పైపులైన్ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

కోట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లపాటు అభివృద్ధికి దూరంగా ఉన్న పల్లె సీమలను ప్రగతి బాటలో నడిపించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ అన్నారు. కోట మండల పరిధిలోని సిద్ధమ్మకండ్రిగలో జీవీఆర్ రొయ్యల పరిశ్రమ రూ.5లక్షల వ్యయంతో నిర్మించే ఆర్వో ప్లాంట్‌కు సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అదేగ్రామంలో రూ.4.80 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అదే విధంగా కేశవరం ఓవర్‌హెడ్ ట్యాంక్ నుంచి సిద్దమ్మకండ్రిగ గ్రామానికి రెండు కిలోమీటర్ల పైపులైన్ పనులకు భూమిపూజ చేశారు. స్వయం సహాయక సంఘాలకు రుణాలకు సంబంధించి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మద్దాలి సర్వోత్తమరెడ్డి, జలీల్ అహ్మద్, నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, చిల్లకూరు దశరధరామిరెడ్డి, చాపల శ్రీనివాసులు, చిట్టేటి నాగూరయ్య, కోటేశ్వర ప్రసాద్, జడ వేణు, కసుమూరు వెంకటేశ్వర్లు, ఏపీడీ వరప్రసాద్, ఏపీఎం అనీల, తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో వేణు, మధుయాదవ్, ఎంపీటీసీలు దారా సురేష్, షంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులపై దృష్టి: విజయశ్రీ



పున్నేపల్లిలో సిమెంటు రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

ఓజిలి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించనున్నట్లు సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ చెప్పారు. ఓజిలి మండలం పున్నేపల్లి, నెమళ్ళపూడి, కరబల్లవోలు గ్రామాల్లో సిమెంటు రోడ్ల నిర్మాణానికి ఆమె సోమవారం శంకుస్థాపన చేశారు. పున్నేపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, విద్యుత్ దీపాలు, అంతర్గత రోడ్లతో పాటు పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ బీసీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య, మండల కన్వీనర్ గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు, ఉపాధ్యక్షుడు దువ్వూరు శ్రీనివాసులరెడ్డి, కుందాం మాజీ అధ్యక్షుడు కనుమూరు గోపాల్‌రెడ్డి, పురుషోత్తం రాజు, మస్తాన్‌రెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెళ్లకూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంబేడు, చెన్నప్పనాయుడుపేట, శిరసనంబేడు గ్రామాల్లో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. సూళ్లూరుపేట జనసేన అధ్యక్షుడు ఉయ్యాల ప్రవీణ్, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య పాల్గొన్నారు.

సిమెంటు రోడ్లకు భూమిపూజ

దొరవారిసత్రం, అక్టోబరు 21: మండలంలోని మినమనమూడి, శ్రీధనమల్లి, తొగరాముడి గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే విజయశ్రీ భూమి పూజచేశారు. తహసీల్దారు శైలాకుమారి, ఎంపీడీవో గోవర్ధన్, వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, సర్పంచు ప్రసాద్ నాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో దాడుల సంస్కృతి లేదు

నెలవల సుబ్రహ్మణ్యం

పెళ్లకూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దాడుల సంస్కృతి టీడీపీలో లేదని నెలవల ఆ పార్టీ సూళ్లూరుపేట ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం స్పష్టం చేశారు. సోమవారం శిరసనంబేడులో విలేకర్లతో మాట్లాడుతూ ఎన్డీసీసీబీ మాజీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి పెంచి పోషించిన వ్యక్తులే ఆయనతో ఉన్న వ్యక్తిగత విభేదాల కారణంగా వివాదానికి పాల్పడ్డారని తెలిపారు. మద్యం సిండికేట్‌కు ఒప్పుకోలేదని కామిరెడ్డిపై టీడీపీ నాయకులు దాడి చేయించారని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అనడం విడ్డూరంగా ఉందన్నారు. నియోజకవర్గ పరిధిలో 127 పంచాయతీల్లో ఎక్కడా లేనివిధంగా ఒక్క చిల్లకూరులో మాత్రమే శాంతిభద్రతలకు విఘాతం ఎందుకు కలుగుతోందో వైసీపీ నేతలు ఆలోచించుకోవలన్నారు.

పల్లెపండుగతో గ్రామాల అభివృద్ధి

చిల్లకూరు, అక్టోబరు 21: పల్లెపండుగ కార్యక్రమంతో గ్రామాల అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని కాకువారిపాళెం, బల్లవోలు, తిక్కవరం, ముత్యాలపాడు గ్రామాల్లో సిమెంటు రోడ్ల నిర్మాణానికి శిలాఫకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో గోపి, సన్నారెడ్డి వెంకటరమణారెడ్డి, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, దువ్వూరు వెంకటకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, వినయ్‌కుమార్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, సతీస్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మన్నెం శీనయ్య, లీలావతి పాల్గొన్నారు.

చెంగాళమ్మ హుండీ ఆదాయం రూ.67 లక్షలు

సూళ్లూరుపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 116 రోజులకుగాను రూ.67,98,889 వచ్చినట్లు దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి తెలిపారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



ప్రశంసాపత్రాలతో విజేతలు

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థిని టి.శ్రీలక్ష్మి జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల ఏలూరు జిల్లాలో జరిగిన 68స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అంతరజిల్లాల సాఫ్ట్‌బాల్ అండర్ 19 రాష్ట్రస్థాయి పోటీలలో శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినీలు ప్రాతినిధ్యం వహించారు. ఇందులో టి.లక్ష్మీ, ఎం.నిఖిత. పి.తనూజ గెలుపొందారు. అత్యుత్తమ ప్రతిభకనబరిచి మొదటిస్థానం కైవసం చేసుకున్న టి.లక్ష్మీ జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం జరిగిన ఓ కార్యక్రమంలో పలువురు ఆ యువతిని అభినందిస్తూ ఇదే స్ఫూర్తిని కొనసాగించి జాతీయస్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు. వీరికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ సాయిసుమతిని ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.



గెలుపొందిన తైక్వాండో క్రీడాకారులు

అంతర కళాశాలల క్రీడా పోటీలు ప్రారంభం



ట్రోఫీ అందుకుంటున్న బీఎస్ఆర్ డిగ్రీకాలేజీ జట్టు

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో అంతర కళాశాలల క్రీడా పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వ్యాయామ విద్యా విభాగాధిపతి ప్రొఫెసర్ ఎం.శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పురుషుల కబడ్డీ, తైక్వాండో క్రీడా పోటీలను ఎస్వీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.భూపతినాయుడు ప్రారంభించారు. ఎస్వీయూ పరిధిలోని వివిధ కళాశాలల నుంచి కబడ్డీకి 25 జట్లు, తైక్వాండో పోటీలలో 22 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. తొలిరోజు లీగ్‌దశ కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఎస్వీయూపై బీఎస్ఆర్ డిగ్రీ కాలేజీ విజయకేతనం ఎగురవేసింది. తైక్వాండోలో ఎనిమిది మంది విజేతలుగా నిలిచారు. విజేతలకు మెడల్స్ సర్టిఫికెట్లు అందజేశారు.

పోలీసు పీజీఆర్ఎస్‌కు 66 ఫిర్యాదులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 66 ఫిర్యాదులు అందాయి. అదనపు ఎస్పీ వెంకట్రావు ఆధ్వర్యంలో పోలీసులు ఫిర్యాదుదారుల నుంచి వినతులు స్వీకరించారు.

ఎన్నికల బరిలో 35 మంది

తిరుపతి(ఆటోనగర్) అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో 35 మంది అభ్యర్థులు బరిలో నిలిచినట్లు ఎన్నికల అధికారి ఉమాపతి తెలిపారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణలో భాగంగా 43 మందిలో ఎనిమిది మంది ఉపసంహరించుకోగా, 35 మంది ఎన్నికల బరిలో ఉన్నారని పేర్కొన్నారు. ఈనెల 28న పోలింగ్ జరుగుతుందని తెలిపారు.

11 ఎర్రచందనం దుంగల స్వాధీనం: ముగ్గురి అరెస్టు



స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

మంగళం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా సీకేదిన్నె మండలం వద్ద టాస్క్‌ఫోర్సు పోలీసులు ముగ్గురిని అరెస్టు చేసి, 11 ఎర్రచందనం దుంగలు, ఒక కారు స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎస్ఐ సురేష్‌బాబు బృందం ఆదివారం రాత్రి సీకేదిన్నె వద్ద కూంబింగ్ చేపట్టింది. మద్దిమడుగు అటవీ ప్రాంతంలో కారులో కొందరు ఎర్రచందనం దుంగలు లోడ్ చేస్తుండగా చుట్టుముట్టారు. ముగ్గురిని పట్టుకోగా మిగిలిన వారు పారిపోయారు. నిందితులు తమిళనాడు సేలం జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. 11 ఎర్రచందనం దుంగలు, కారును స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శ్రీనివాస క్రీడా సముదాయంలో సోమవారం జిల్లాస్థాయి అండర్ 14, 17 విభాగాల బాలబాలికల చదరంగం పోటీలు నిర్వహించారు. అండర్ 14 బాలికల విభాగంలో వి.త్రిపురాంబిక, సిరిగిరిసాత్విక తొలి రెండు స్థానాలు కైవసం చేసుకున్నారు. బాలుర విభాగంలో సాత్విక్‌కృష్ణ ద్వితీయస్థానంలో నిలిచాడు. అండర్ 17 బాలుర విభాగంలో రెడ్డిదేదీప్, సిరిగిరి పార్థసాయి, గౌరవ్‌వెంకట్‌లు తొలి మూడు స్థానాల్లో సత్తాచాటారు. వీరు ఈనెల 29, 30 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు.

సమగ్ర పోషక యాజమాన్యంపై శిక్షణ ప్రారంభం



తిరుపతి రూరల్, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ(పీఏసీ)సభ్యులకు సమగ్ర పోషక యాజమాన్యంపై నిర్వహించిన 15రోజుల శిక్షణని సోమవారం ప్రారంభించారు. చిత్తూరు ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ సంధ్యారాణితో ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ సుమతి కలసి ఈశిక్షణని ప్రారంభించి మాట్లాడారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువుల ప్రాముఖ్యత, వాడకం, సేంద్రీయ, జీవన ఎరువులను ఏపంటకి ఎంత మోతాదులో వినియోగించాలన్న అంశాలను వివరించారు. అలాగే భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వాడాలని సూచించారు. డాక్టర్ కేవీ నాగమాధురి, డాక్టర్ భార్గవ్, విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కదిరిమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి



అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న అడిషనల్ కమాండెంట్ అరుణ్ బోస్

వెంకటగిరి టౌన్, అక్టోబరు 21,(ఆంధ్రజ్యోతి): అమరులైనా పోలీసులు త్యాగాలు మరువలేనివని 9వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ అరుణ్ బోస్ పేర్కొన్నారు. సోమవారం మండల పరధిలోని 9వ బెటాలియన్‌లో పోలీసు అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. అమరవీరులు ఘాట్ వద్ద నివాళులర్పించారు.మరణించిన బెటాలియన్ సిబ్బంది కుటుంబ సభ్యులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

చీరకు నిప్పంటుకొని వృద్ధురాలి మృతి

తడ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): చీరకు నిప్పంటుకొని తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు మృతి చెందింది. మండల పరిధిలోని మాంబట్టు గ్రామానికి చెందిన భువనగిరి శాంతమ్మ(79) ఈ నెల 5వ తేదీ ఇంట్లో కట్టెల పొయ్యి మీద నీళ్లను వేడిచేసే క్రమంలో మంటలు ఎగిసిపడి శాంతమ్మ చీరకు నిప్పంటుకుంది. తీవ్రంగా గాయపడిన ఆమెను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

24న ఐటీఐలో జాబ్ మేళా

వెంకటగిరి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 24వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాధం, ఐటీఐ ప్రిన్సిపాల్ ఉమారాణి తెలిపారు. అమరాజా గ్రూప్, ఫోర్డే మేనేజ్‌మెంట్ సర్వీసెస్, ప్యానాసోనిక్‌లైఫ్ సొల్యూషన్స్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, బీటెక్, డిగ్రీ ఉతీర్ణులైన వారు అర్హులని చెప్పారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్, బయోడేటాతో హాజరు కావాలన్నారు. వివరాలకు 7013509543, 9491458910 నంబర్లను సంప్రదించాలన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

చిల్లకూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 22 నుంచి నవంబరు 8వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దారు శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు రెవెన్యూ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

తడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కారూరు గ్రామానికి కావేరి స్నేహ(22) అదృశ్యం అయినట్లు ఆమె తల్లి అముద పోలీసులకు ఫిర్యాదు చేసింది. కావేరి స్నేహ పుట్టుకతోనే బధిరురాలు. ఈనెల 19వ తేదీ ఉదయం 10 గంటల సమయంలో కావేరిస్నేహ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వ్యాయామ అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

వెంకటగిరి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలోని విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాయామ అతిథి అధ్యాపకుడిగా పనిచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ విజయశేఖరం తెలిపారు. ఎంపీఈడీ, నెట్, ఎస్ఎల్ఈటీ, పీహెచ్‌డీ అర్హత కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పార. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 25వ తేదిలోగా కళాశాల పనివేళల్లో దరఖాస్తు అందజేయాలని కోరారు.

రెవెన్యూ రికార్డుల పరిశీలన

బాలాయపల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి మండలంలో గత ప్రభుత్వ హయాంలో ఫ్రీహోల్డ్ అయిన అసైన్డ్ భూముల రికార్డులను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుజన పరిశీలించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆమె ఫ్రీహోల్డ్ అయిన అసైన్డ్ భూములు, మేతపోరంబోకు నుంచి అనాదీనంగా మారిన, అటవీ భూమిని మార్పు చేసి పట్టాలు, వాటి లబ్ధిదారులు వివరాలను నిశితంగా పరిశీలించారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా

వెంకటగిరి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ పాఠశాలల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఎంఈవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, మంజుల మాట్లాడుతూ పాఠశాలల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం ఇస్తున్న వేతనాలు చాలక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వేతనాలు రూ.6వేల నుంచి రూ.26 వేలకు పెంచాలని, నాలుగు నెలల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా 1వ తేదీనే వేతనాలు చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాల కోరారు. అనంతరం ఎంఈవో వెంకటేశ్వరావుకు వినతిపత్రం అందచేశారు.

యువకుడి ఆత్మహత్య

చిట్టమూరు, అక్టోబర్ 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోగిలి రొయ్యల గుంటల వద్ద తుపాకుల చెంచుకృష్ణయ్య(30) సోమవారం గుళికలు తిని ఆత్మహత్య చేసుకున్నాడు. రొయ్యల కాలువ వద్ద కాపలాదారుగా ఉన్న చెంచుకృష్ణయ్య కుటుంబ కలహాలతో గుళికలు తిన్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

భూ సమస్యలు పరిష్కరించండి


తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని శ్రీకాళహస్తి తహసీల్దారు లక్ష్మీనారాయణను సీపీఐ నాయకులు కోరారు. సోమవారం వారు తహసీల్దారును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య మాట్లాడుతూ శ్రీకాళహస్తి మండలం మద్దిలేడు రెవెన్యూ సర్వే నెంబరు 1లో 26 ఎకరాలు ప్రభుత్వ భూమిని దళితులకు ఇవ్వాలన్నారు. అదేవిధంగా రామాపురం దళితులకు ఇచ్చిన భూములకు సర్వే నిర్వహించి భూములను చూపించాలన్నారు. భగత్‌సింగ్ కాలనీలో నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. నారాయణపురం పంచాయతీ ముళ్లపూడి కాలనీలో పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి లేఅవుట్‌కు రోడ్లు వేసుకున్న రియల్‌ఎస్టేట్ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు.ఈ కార్యక్రమంలో మించల శివకుమార్, రాజయ్య, మణి, రమణయ్య, పెంచలయ్య, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అబాకస్‌లో విశ్వభారతి విద్యార్థి ప్రతిభ


చరిష్మను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోపాలవనం విశ్వభారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ఇరగ చరిష్మ చెన్నైకు చెందిన అబాకస్ అండ్ మెంటల్ అర్థమేటిక్ టీచర్స్ అసోసియేషన్ నిర్వహించిన అబాకస్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. కరస్పాండెంట్ శోభ, హెచ్‌ఎం శ్రీధర్, ఉపాధ్యాయులు విద్యార్థి చరిష్మను అభినందించారు.

లిటిల్ మాస్టర్ విద్యార్థుల ప్రతిభ



శ్రీకాళహస్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): చెన్నైలో జరిగిన అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో పట్టణానికి చెందిన లిటిల్‌మాస్టర్ అబాకస్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ పోటీల్లో 32మంది విద్యార్థులు పాల్గొనగా 27మంది చాంపియన్ ఆఫ్ చాంపియన్, ముగ్గురు చాంపియన్స్ సాధించారు. నిర్వాహకులు దివ్య, మునికుమర్ వారిని అభినందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

శ్రీకాళహస్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయమూర్తి ఆదేశాల మేరకు మండల లీగల్ సర్వీస్ ఆధ్వర్యంలో న్యాయవాదులు పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించారు. భోజనంపై సంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై న్యాయమూర్తికి నివేదిక అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రాజేశ్వరరావు, గరికపాటి రమేష్ బాబు, రజని, ప్రజ్ఞశ్రీ, మండల లీగల్ సర్వీస్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఎమ్మెల్సీ హరిప్రసాద్



శ్రీకాళహస్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూ నాంబ సమేత కాళహస్తీశ్వర స్వామిని సోమ వారం జనసేన పార్టీ ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనా నంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శులు అంజూరు చక్రధర్, కొట్టే సాయి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి



పాతవీరాపురంలో విద్యాసామగ్రి పంపిణీ

ఏర్పేడు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని బాగా చదవాలని ఎంఈవో ప్రేమలత తెలిపారు. సాహసం స్వచ్ఛంద సంస్థ విజయనగరం వ్యవస్థాపకులు మాచవరం గణేష్ సౌజన్యంతో సంస్థ ప్రతినిధులు శివకోటి, ధవీన్ సోమవారం ఏర్పేడు మండలంలోని చిందేపల్లి, బండివానిపల్లి, అముదూరు, మునగలపాళెం, వెంకటపాళెం పాఠశాలల విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం భువనేశ్వరి, కమిటీ చైర్మన్ లక్ష్మి, ఉపాధ్యా యులు, పద్మజ, వెంకటేశ్వర్లు, డాక్టర్ దేవరాజులు, ఉషారాణి, శ్రీహరి, శంకరయ్య, గురవారెడ్డి, లక్ష్మణరావు, నిరంజన్, వాసు, బాలాజీ, మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పట్టాభూమిలో అంత్యక్రియలు.. పోలీసులకు ఫిర్యాదు

వరదయ్యపాళెం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టాభూమిలో అక్రమంగా ప్రవేశించి దౌర్జన్యంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఎస్‌ఐ మల్లికార్జున కథనం మేరకు..సత్యవేడు మండలం ఇరుగళం గ్రామానికి చెందిన జయ శంకర్‌రెడ్డి, వరదయ్యపాళెం మండలంలోని యానాదివెట్టు పంచాయతీలో సర్వే నెంబరు 58/27 నుంచి 58/37 సర్వే నెంబరులో 13.10 ఎకరాల భూమిని 2018లో కొనుగోలు చేశాడు. కంచె వేసి మామిడితోట పెంచాడు. ఇటీవల వ్యవసాయేతర భూమిగా మార్పు చేశారు. కాగా ఈనెల 15న యానాదివెట్టు ఎస్సీకాలనీకి చెందిన రాజారామ్ తండ్రి మునికృష్ణయ్య మరణించాడు. జయశంకర్‌రెడ్డి కొనుగోలు చేసిన పొలంలో శ్మశాన స్థలం ఉందని అందులో అంత్యక్రియలు చేశారు. అడ్డుకోవడానికి యత్నించిన జయశంకర్‌రెడ్డిపై రాజారామ్‌తో పాటు అతని బంధువులు మస్తానయ్య, దిలీప్, గజేంద్రుడు, గంగాధరం దాడిచేశారు. బాధితుడు గ్రామపెద్దలను ఆశ్రయించగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తర్వాత పట్టించుకోక పోవడంతో బాధితుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జున్ తెలిపారు.

పిల్లర్లకే పరిమితమైన అంగన్వాడీ భవనం



బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాంపాళెం దళితవాడలో అంగన్వాడీ భవనం ఎనిమిదేళ్లుగా పిల్లర్లకే పరిమితమైంది. అప్పటి టీడీపీ ప్రభుత్వంలో అంగన్వాడీ భవనం మంజూరైంది. కాంట్రాక్టర్ పిల్లర్లు వేసి పనులు ఆపి వేశారు. ప్రస్తుతం చిన్న అద్దె భవనంలో పాఠశాల నడుపుతున్నారు. భవనం సకాలంలో నిర్మించకపోవడంతో నిధులు రద్దు అయ్యాయి. భవనం నిర్మించాలని పలుమార్లు కోరినా పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

పుత్తూరు వార్తలు

వైభవంగా ఆలయ పుష్కర కుంభాభిషేకం

పుత్తూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు మండలంలోని తిరుపతి-చెన్నై జాతీయ రహదారి పక్కన వున్న శ్రీనివాసరెడ్డినగర్‌లో కొలువైన శ్రీవల్లీ దేవసేన సుబ్రమణ్యస్వామి ఆలయ పుష్కర కుంభాభిషేకం సోమవారం వైభవంగా నిర్వహించారు. దీక్షాహోమం, సుబ్రమణ్యస్వామి వ్రతం, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, ఆడిటర్ రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పుత్తూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పుత్తూరులోని ధర్మరాజుల ఆలయం ఎదురుగా రైల్వే క్రాసింగ్ వద్ద అండర్ కేబుల్ పని కారణంగా తిరుపతి జాతీయ రహదారి, రజకకాలనీల్లో మంగళవారం విద్యుత్ సరఫరాను ఆపేస్తున్నామని ఏడీఈ శంకరయ్య, ఎఈ జయసాయిలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ధర్మరాజుల ఆలయం నుంచి ఏఎంసీ కల్యాణ మండపం వరకు తిరుపతి జాతీయ రహదారిలో జరిగే విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

నట్టల మందు పంపిణీ

శ్రీకాళహస్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం పుల్లారెడ్డికండ్రిగ గ్రామంలో పొట్టేళ్లకు పశుసంవర్ధకశాఖ సమాయ సంచాలకులు డాక్టర్ ఎన్‌వీ శ్రీకాంత్‌బాబు ఆధ్వర్యంలో డీవార్మింగ్ మందులు వేశారు. ఈ మందు తాపించడం వలన గొర్రెలు, మేకల్లో ఉంటే నట్టలను నిర్మూలించవచ్చని ఆయన తెలియజేశారు. ఈ కార్య క్రమంలో పశువైద్యులు డాక్టర్ రవీంద్రవర్మ, సిబ్బంది జనార్ధన్, వెంకటేష్, యూసఫ్, అబ్దుల్ పాల్గొన్నారు.

ఆగమోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వ రాలయంలో వెలసిన మృత్యుంజయస్వామికి సోమవారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకస్వామికి అభిషేకం చేశారు. తర్వాత మృత్యుంజయ స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. వివిధ పుష్పాలతో, గజమాల, వెండి నాగాభరణంతో స్వామివారిని శోభాయ మానంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు, సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

గౌడసంఘాన్ని రద్దు చేసే అధికారం లేదు

శ్రీకాళహస్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి గౌడ సంక్షేమ సంఘాన్ని రద్దుచేసే అధికారం ఎవరికీ లేదని తిరుపతి జిల్లా గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజశేఖర్‌గౌడ్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జూన్ 23న కార్యవర్గాన్ని ఎన్నుకున్నామన్నారు. కొందరు తమ రాజకీయ లబ్ధి కోసం కొన్ని సంఘాలను ఏర్పాటు చేసుకున్నారని వివరించారు. అయితే ఈ సంఘాన్ని రద్దు చేసే అధికారం వారికి లేదని పేర్కొన్నారు. రద్దుపరచాలని పత్రికలో ప్రకటన ఇవ్వడం సిగ్గుచేటన్నారు. అనంతరం గౌతులచ్చన్న విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్య క్రమంలో నారాయణస్వామిగౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, బత్తయ్య గౌడ్, కన్నయ్య గౌడ్ పాల్గొన్నారు.

కార్యకర్తలే టీడీపీకి ప్రాణం

శ్రీకాళహస్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలే టీడీపీకి ప్రాణమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వ హించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్లెలను అభివృద్ధి చేసుకుందాం

శ్రీకాళహస్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పల్లెలను అభివృద్ధి చేసుకుంటేనే రాష్ట్రం పచ్చగా ఉంటుందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. తొట్టంబేడు మండలం సాంబయ్యపాళెంలో రూ.20లక్షలతో సీసీరోడ్డు, డ్రైన్ నిర్మాణానికి సోమవారం ఆయన భూమిపూజ చేశారు.

సమస్యలుంటే రీసర్వేలో పరిష్కరించుకోండి

కేవీబీపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ వారు నిర్వహించిన భూసర్వేలో ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలని మండల సర్వేయర్ సురేష్ చెప్పారు. సోమవారం మండల కేంద్రంలోని సచివాలయం వద్ద రీసర్వేపై గ్రామసభ నిర్వహించారు.

ఏఐఎస్‌ఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



శ్రీకాళహస్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):ఏఐఎస్‌ఎఫ్ నూతనకార్యవర్గాన్ని విక్రమ్ జూనియర్ కళాశాలలో సమావేశమై ఎనుకున్నారు. అధ్యక్షుడుగా వరుణ్‌సందేశ, కార్యదర్శిగా గిరిధర్ సాయాలను, మహిళా నాయకులుగా కావ్య, హలీమా, భావనను ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి మునిచందు, సల్మాన్, శివ, బాబి, ప్రదీప్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు ఫిర్యాదుల వెల్లువ


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బార్‌లో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. తొట్టంబేడు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రజాదర్బార్ నిర్వహించారు. మూడు గంటల పాటు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. తొట్టంబేడు మండల పరిధి నుంచి సుమారుగా 175 ఫిర్యాదులు వచ్చాయి. అందులో అత్యధికంగా భూసమస్యలపైనే వచ్చాయి. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ హయాంలో పెద్దఎత్తున భూముల రికార్డులను తారుమారు చేశారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చేసిన పాపాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శిం చారు. భూముల రికార్డుల తారుమారులో పాత్రధారులైన అధికారులపై చర్యలు తీసు కుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునిరాజా నాయుడు, మురళినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి జూడో పోటీలు

ఓవరాల్ చాంపియన్ అనంతపురం


గెలుపొందిన వారు

శ్రీకాళహస్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ 68వ జూడో పోటీలు ముగిశాయి. ఓవరాల్‌చాంపియన్‌గా అనంతపురం నిలిచింది. విజేతలకు బహు మతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన టీడీపీ నాయకుడు జగన్నాథంనాయుడు. డీవైఈవో ప్రభాకర్‌రాజు మాట్లాడుతూ గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఈ పోటీలో గెలుపొందిన వారికి 25 నుంచి 30వ తేదీ వరకు కోచ్ గోపి ఆధ్వర్యంలో కోచింగ్ ఉంటుందని వివరించారు. నవంబరు 7నుంచి 11వ రకు జమ్ములో జాతీయస్థాయి పోటీలు జరుగుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బాబు, హెచ్‌ఎం రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో భవనంపై నుంచి పడి కూలీ మృతి


మృతి చెందిన సుజిత్ కొరియా

రేణిగుంట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో భవనంపై నుంచి కింద పడి కూలీ మృతిచెందాడు. ఈ ఘటన అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో చోటు చేసుకుంది. అర్బన్ పోలీసుల కథనం మేరకు.. కరకంబాడి రోడ్డులో ఉన్న అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో నూతన భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ భవన నిర్మాణ పనులు విజయవాడకు చెందిన ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఆ కాంట్రాక్టు తీసుకున్న వ్యక్తి అసోం నుంచి ఆరుగురిని పిలిపించి బేల్దారు పనులు చేయిస్తున్నాడు. ఆదివారం రాత్రి సుజిత్ కొరియా(47) అనే కూలీ మద్యం అధికంగా సేవించాడు. భవనం పైఅంతస్తులో సహచరులతో కలిసి నిద్రించాడు. మద్యం మత్తులో మూత్ర విసర్జనకు వెళ్లి ప్రమాదవశాత్తు భవనంపై నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం ఉదయం గుర్తించి రేణిగుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకృతి సాగు కూరగాయలు మేలు



కూరగాయలను ప్రదర్శిస్తున్న ఏపీఎం

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు, ఏపీఎం మునెయ్య తెలియజేశారు. సోమవారం వారు ఎంపీడీవో కార్యాలయంలో కూరగాయాల ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని గాజులపెళ్లూరు, ఆలత్తూరు, వీఎస్‌పురం, కనమనంబేడు తదితర గ్రామాలలో రైతు సాధికారిత సంస్థ ఆధ్వర్యంలో పలువురు రైతులు కూరగాయాలను, వరి పంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో పండిస్తున్నట్లు చెప్పారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ప్రభుత్వం రాయి తీలను ఇస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యదర్శి సుబ్రమణ్యం, రిసోర్సు పర్సన్లు జయలక్ష్మి, ఆశా, రేవతి పాల్గొన్నారు.

ఆహార ఉత్పత్తులు తయారు చేసే సంఘాలకు

మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తాం


సమావేశంలో మాట్లాడుతూ డాంగేయాదవ్

వరదయ్యపాళెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆహార ఉత్పత్తులను తయారు చేసే స్వయం సహాయక సంఘాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామని తిరుపతి జిల్లా సత్యవేడు గ్రామీణాభివృద్ధి ఏపీఎం డాక్టర్ డాంగే అన్నారు. సోమవారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో సంఘమిత్రల సమా వేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార ఉత్పత్తులు తయారుచేసే సంఘాలు ఓఎన్డీసీలో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. దీంతో మార్కెటింగ్ సదుపాయం ఏర్పడుతుందని తెలిపారు.

వీఆర్వోలు రోజూ గ్రామాల్లో పర్యటించాలి

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోలు ప్రతిరోజూ గ్రామాలలో పర్యటిస్తే ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ సుబ్రమణ్యం తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వీర్వోలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనిని సకాలంలో చేయాలన్నారు. భూ సమస్యలను ప్రత్యేకంగా గుర్తించాలన్నారు. ఈ-క్రాప్‌ను ప్రతి గ్రామంలో మొదల పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ చంద్రబాబునాయుడు, సీనియర్ సహాయకులు నాగరాజురెడ్డి పాల్గొన్నారు

విద్యార్థుల వివరాలు యుడైస్‌లో అప్‌డేట్ చేయాలి

పిచ్చాటూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రతి పాఠశాలలో విద్యార్థులకు సంబంధించిన వివరాలు యుడైస్‌లో అప్‌డేట్ చేయాలని ఎంఈవో హేమమాలిని తెలిపారు. సోమ వారం స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 22 తేదీ క్యాంపు ప్రతి సచివాలయంలో జరుగుతుందని, విద్యార్థులు ఆధార్ తీయించాలని ఆధార్‌లో తప్పులు ఉంటే సరిచేసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఈవో-2 యుగంధర్‌రాజు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

హౌసింగ్ ఏఈ బాధ్యతల స్వీకరణ


ఏఈ మహ్మద్ అక్రమ్

వరదయ్యపాళెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వరదయ్య పాళెం హౌసింగ్ ఏఈగా సోమ వారం మహ్మద్ అక్రమ్ బాధ్య తలు స్వీకరిం చారు. ఆయన సూళ్లూరుపేట నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. ఆయనకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

చిందేపల్లి రోడ్డు సమస్య పరిష్కరించండి


ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న చిందేపల్లి గ్రామస్తులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): చిందేపల్లి రోడ్డు సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఏర్పేడు మండలం చిందేపల్లి గ్రామస్తులు సోమవారం ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాళహస్తి మండలం పూతలపట్టు -నాయుడుపేట జాతీయ రహదారి నుంచి తమ గ్రామానికి ఎన్నో దశాబ్దాల నుంచి ప్రభుత్వ రోడ్డు ఉందన్నారు. సుమారు 30 ఏళ్ల క్రితం తమ గ్రామ సమీపంలో ప్రైవేటు పరిశ్రమ వచ్చిందన్నారు. క్రమంగా చిందేపల్లి రోడ్డును పరిశ్రమ నిర్వాహకులు క్రమక్రమంగా ఆక్రమించారని వాపోయారు. గత ప్రభుత్వ పాలనలో మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, పరిశ్రమ నిర్వా హకులు ఒకటై కుట్రపూరితంగా రాత్రికి రాత్రి చిందేపల్లిరోడ్డును మూసి వేశారని వాపోయారు. అప్పట్లో ఆందోళనలు చేయడంతో తమ గ్రామానికి ప్రత్యామ్నాయ రోడ్డును ఏర్పాటు చేసి చేతులు దులిపేసుకున్నారని వివరించారు. ప్రస్తుతం పదిరోజుల నుంచి ప్రత్యామ్నాయ రోడ్డును కూడా మూసివేసేందుకు పరిశ్రమ నిర్వాహకులు ప్రయత్నాలు సాగిస్తున్నారని ఆరోపించారు. దీనిపై న్యాయం చేయాలని విన్నవించారు.

కూటమి రాకతో పల్లెల్లో పండుగ



ఏర్పేడు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కూటమి రాకతో పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొందని ప్రజలుసంతోషంగా ఉన్నారని టీడీపీ మండల నాయకులు గిరిప్రసాద్‌రెడ్డి అన్నారు. ఏర్పేడు మండలం మర్రిమందలో మురుగుకాలువల నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, టీడీపీ నాయకులు మునిరెడ్డి, సీతాపతి ఆచారి, కేశవులు, వరదయ్య, వెంకటయ్య, చలపతి, పాండు, రంగడు పాల్గొనారు.

వర్షం పోయినా వీడని బురద


వీధుల్లో నిలిచిపోయిన వర్షపు నీటిని చూపుతున్న మహిళలు

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఎస్టీలు నివాసం ఉన్న వీధుల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో స్థానికులు బురదతో అవస్థలు పడుతున్నారు. వారం రోజులుగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. కాలనీలో కొన్ని వీధులకు సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో వర్షపు నీరు వీధుల్లోనే నిలిచి బురదమయం కావడంతో ప్రజలు రాకపోకలు చేయడానికి ఇబ్బందులు పడు తున్నారు. ఈ వీధులకు సిమెంట్ రోడ్లు, డ్రైనేజి కాలువలు నిర్మించాలని సోమవారం ఎంపీడీవో త్రివిక్రమ్‌రావుకు అర్జీలు ఇచ్చినట్లు టీడీపీ తెలుగు మహిళా మండల అధ్యక్షురాలు ఉషారాణి తెలిపారు.